www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ఏలూరు పశ్చిమ గోదావరి

ఎన్నికల 'పంచాయతీ'..!

- స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషనర్ కసరత్తు
- ప్రీ ఎలక్షన్ షెడ్యూల్ విడుదల
- డిశంబర్ 15లోపు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికి గడువు
- 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు నిర్ణయం
- ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 409 పంచాయతీలు
- జులై నుంచి పరిషత్ ఎన్నికల నిర్వహణపై కసరత్తు
- ఉమ్మడి పశ్చిమలో 48 జెడ్‌పిటిసి, 876 ఎంపిటిసి స్థానాలు
- గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ముందస్తుగా స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. బుధవారం ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి రాసిన లేఖ దీన్ని స్పష్టం చేస్తోంది. ఎన్నికలకు సంబంధించిన ప్రీ ఎలక్షన్ షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, జులై నుంచి జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వానికి ఎన్నికల కమిషన్ లేఖలో పేర్కొంది. దీంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. ముందుగా పంచాయతీ ఎన్నికలు జరగనుండటంతో ఇప్పటి నుంచి అభ్యర్థుల పేర్లపై గ్రామాల్లో చర్చ సాగుతోంది. గడువు కంటే ముందుగానే ఎన్నికల నిర్వహణ జరుగుతుందా.. లేక ప్రభుత్వం వెనక్కి తగ్గుతుందా అనే చర్చ సైతం నడుస్తోంది. విభజిత ఏలూరు జిల్లాలో 27 మండలాలు ఉండగా 547 పంచాయతీలకు, పశ్చిమలో 20 మండలాల పరిధిలో 409 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. 2020 ఫిబ్రవరిలో నాలుగు విడతలుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 907 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 21వ తేదీతో నాలుగో విడత ఎన్నికల ప్రక్రియ ముగిసి సర్పంచులు బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందుగానే ఈసారి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ చూస్తోంది. దీంతో అక్టోబర్ 15వ తేదీలోగా డీలిమిటేషన్, రిజర్వేషన్లు ఖరారు, అక్టోబర్ 16 నుంచి నవంబర్ 15లోపు వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, నవంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు రిటర్నింగ్ అధికారులను నియమించుకోవాలని, నవంబర్ 16 నుంచి పోలింగ్ స్టేషన్లు ..6లో

వార్త మధ్య పేజీల్లో..

పెరిగి తగ్గుతున్న గోదావరి వరద

ఆదర్శ ప్రజానేత ఆర్ఎస్

జిల్లాలో ఎరువుల కొరత లేదు : జెసి

పశ్చిమలో మెడికల్ కాలేజీ

పాలకొల్లు ప్రాంతంలో ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

పిపిపి పద్ధతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయం

దగ్గులూరు వద్ద గతంలోనే 60 ఎకరాలు కేటాయింపు

రూ.470 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేసేందుకు గురువారం కేబినెట్‌లో ఆమోద ముద్ర పడింది. మెడికల్ కాలేజీ నిర్మాణానికి పిపిపి (పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో నిర్మించాలని నిర్ణయం జరిగింది. దీంతో మరోసారి పశ్చిమగోదావరి జిల్లాలో మెడికల్ కాలేజీ నిర్మాణం చర్చనీయాంశంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీ నిర్మించాలని తలపెట్టింది. అందులో భాగంగా పాలకొల్లు మండలం దగ్గులూరులో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా 60 ఎకరాల భూములను సేకరించింది. మొత్తం రూ.470 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. పునాదులు సైతం వేసి పనులు సాగించింది. తర్వాత మెడికల్ కాలేజీ నిర్మాణం ఆగిపోయింది. ఏలూరులో మెడికల్ కాలేజీ పనులు మాత్రమే ముందుకు సాగించింది. జిల్లాల విభజన జరిగిన తర్వాత మెడికల్ కాలేజీ నిర్మాణం చేయాలని అక్కడ నాయకులు పట్టుబట్టారు. ప్రభుత్వం మాత్రం పాలకొల్లు మండలం దగ్గులూరులో చేపట్టిన మెడికల్ కాలేజ్‌ని పక్కన పెట్టేసింది. ..6లో





నేడు సిఐటియు నగర 16వ మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) ఏలూరు నగర 16వ మహాసభ ఐదో తేదీ శుక్రవారం ఏలూరు సంఘ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివిఎన్.ప్రసాద్, వైఎస్.కనకారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సిఐటియు జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణ రాజు నగర్‌లో మహాసభ జరుగుతుందని తెలిపారు.

6న మండల మహాసభ జయప్రదానికి పిలుపు

జంగారెడ్డిగూడెం :స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు టౌన్ మండల కమిటీ సమావేశం పసుల సూర్యరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు టౌన్ కార్యదర్శి సుభాషిణి మాట్లాడుతూ సిఐటియు టౌన్ మండల మహాసభ సెప్టెంబర్ ఆరో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు యుటిఎఫ్ భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి పఠాన్ మస్తాన్, యు.సత్యనారాయణ, బి.బాలరాజు, మహబూబ్ సుభాని, నాయుడు వెంకన్న బాబు పాల్గొన్నారు.

సొసైటీ చైర్‌పర్సన్‌గా సూర్యనారాయణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యనారాయణ

మండలంలోని మక్కినవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్‌పర్సన్‌గా ఆచంట సూర్యనారాయణ, పర్సన్లు నరదల నాగేశ్వరరావు, దాసరి వెంకటలక్ష్మి, పర్సన్ ఇన్‌ఛార్జి యర్రా ఏసుకుమార్ పర్యవేక్షణలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచంట సూర్యనారాయణ మాట్లాడుతూ సొసైటీని ప్రగతి పథంలో నడిపించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సర్పంచి మెతుకుమిల్లి గోపాలరావు, కొడాలి విజయ, జి.ప్రతాప్‌కుమార్, వాసిరెడ్డి రామ్మోహన్‌రావు, సిఇఒ యువివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యావ్యాప్తికి ధర్మరాజు కృషి అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

విద్యావ్యాప్తికి ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు కూటమి నాయకులు అన్నారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఎంఎల్ఎ సమకూర్చిన విద్యాసామగ్రిని ఆయన తరపున కూటమి నాయకులు విద్యార్థులకు అందించారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు పత్తి మదన్ విద్యా సామగ్రిని పుస్తకాలు, పెన్నులు విడివిడిగా సర్దుబాటు చేసిన కిట్లను తయారుచేసి ఎంఎల్ఎకు సహకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు, భీమడోలు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్ఎస్.గిరి, యుగంధర్‌తోపాటు ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణతో ఆర్థికాభివృద్ధి

ముసునూరు :చెత్త సేకరణ ద్వారా ప్రతి సచివాలయం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండలంలోని సూరేపల్లి గ్రామంలో చెత్త సేకరణ డోర్ టు డోర్ కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందో ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఆర్థిక ఆదాయం పొందవచ్చని, ఆ విధంగా చెత్త సేకరణ చేపట్టడంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఆదాయం కూడా వస్తుందని తెలిపారు.

సమావేశానికి అధికారుల గైర్హాజరు

చింతలపూడి : మండలంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి కొంతమంది అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని, ఎలా పరిష్కరమవుతాయని ప్రశ్నించారు. మండలంలో అభివృద్ధి పనుల కోసం రూ.27 లక్షలకు తీర్మానించినట్లు ఎంపిపి రాంబాబు తెలిపారు.

చింతలపూడి ఎఎంసి చైర్‌పర్సన్‌గా లక్ష్మీపార్వతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎఎంసి చైర్‌పర్సన్‌గా చీదరాల లక్ష్మీపార్వతి నియమితులయ్యారు. జనసేన పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న చీదరాల మధుబాబు సతీమణి లక్ష్మీపార్వతి. కార్యకర్తలకు అండగా ఉంటూ నిరంతరం పార్టీ కోసం కృషి చేసిన తమను పార్టీ గుర్తించడంతో కృతజ్ఞతలు తెలిపారు. 2024 ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గంలో కూటమి విజయం సాధించడంలో జనసేన మండలాధ్యక్షులుగా ఉన్న చీదరాల మధుబాబు చేసిన కృషికి, ఆయన సేవలను గుర్తించి ఆయన సతీమణికి ఎఎంసి ఛైర్మన్ పదవిని కట్టబెట్టినట్లు జనసేన నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీని గ్రామాల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి బలోపేతం చేశారని, మండలంలో ఎన్నికల ముందు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎన్నికల సభను ఘనంగా నిర్వహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని జనసేన నేతలు చెబుతున్నారు.

ప్రమాదకర రోడ్లను పున:నిర్మించాలి

సిపిఎం ధర్నా, రాస్తారోకో

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వంగాయగూడెం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రమాదకరంగా మారిన రోడ్లను పున:నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఏలూరు నగర కమిటీ ఆందోళనకు దిగింది. గురువారం పెద రైల్వే స్టేషన్ వద్ద ఆశ్రం కాలేజీకి వెళ్లే రోడ్డులో ధర్నా నిర్వహించి అనంతరం వంగాయగూడెం-పెదపాడు రోడ్డులో అధ్వానంగా ఉన్న రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని నినాదాలు చేశారు. నిత్యం ఈ రోడ్లపై ప్రయాణాలు చేయలేకపోతున్నామని వాహనదారులు సిపిఎం ఆందోళనకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 15 నెలలు గడిచినా జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో రోడ్లు చెరువులను తలపిస్తూ గుంతలు ఏర్పడి ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారని చెప్పారు. జిల్లా కేంద్రమైన ఏలూరులోనే పరిస్థితి ఈ విధంగా ఉంటే మండలాలు, మారుమూల ప్రాంతాల రోడ్ల పరిస్థితి చెప్పుకోనవసరం లేదన్నారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ, నగర నాయకులు వైఎస్.కనకారావు, జె.గోపీ, ఎం.ఇసాక్, కడలి రామాంజనేయులు, లెనిన్ తదితరులు పాల్గొన్నారు. రాస్తారోకో కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది.

విద్యార్థులకు పాటలు, జికె పోటీలు

ఏలూరు :గురజాడ అప్పారావు 110వ వర్థంతి, డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు 130వ జయంతి కార్యక్రమాలను పురస్కరించుకొని హై స్కూల్స్, కాలేజీల్లో విద్యార్థులకు పాటలు, జనరల్ నాలెడ్జ్ పోటీలు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, కలిసొచ్చే ఇతర సంఘాలు కలిపి నిర్వహిస్తారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, న్యూ మ్యాంక్ కుంగ్ ఫు సంఘాల తరపున గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో కార్యక్రమ వివరాలు నిర్ణయించారు. వివరాలను ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, హేలాపురి బాలోత్సవం నాయకులు పి.ఆంజనేయులు, కొమ్మోజు శ్రీనివాసరావు, బహుజన ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు, కుంగ్ ఫు ట్రైనర్ జి.రాఘవ, తానుకొండ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సంఘ సంస్కర్త మహాకవి గురజాడ అప్పారావు గురించిన ప్రత్యేకతలు ఆయన రచనలతో ఆయన జీవితం గురించి విద్యార్థుల్లో దేశభక్తిని పెంచే ప్రయత్నం చేపట్టామన్నారు. అనంతరం కరపత్రాలు, ఫ్లెక్సీలు ఆవిష్కరించారు.

ప్రకటన

నా క్లయింటు శ్రీ యలగాటి వీరాస్వామి గారి కుమారుడు శ్రీ రామమోహనరావు, ఏలూరు వారి సంజాయిషి మేర ఈ దిగువ ప్రకటన జారీ చేయటమయినది.

శ్రీ రామమోహనరావు, S/o.వీరాస్వామి, వారి కుటుంబ సభ్యులతో కలసి వ్రాసుకొన్న పార్టీషన్ దస్తావేజు నెం.1145/2001 తేది 12-02-2001 మార్గమధ్యమున పోయినట్లుగా గుర్తించినారు. ఈ దస్తావేజు ఎవరికైనను దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాలో నేటి నుండి వారం రోజులు లోగా తెలియ చేయవలసినదిగా కోరటమైనది.

పి.యస్.చంద్, అడ్వకేటు,
ఏలూరు అశోకనగర్, ఏలూరు-534
తేది.4-9-2025 సెల్: 944011156

MUNICIPAL CORPORATION, ELURU

Roc.No.1496/2020/F2 Dated : .09.2025

NOTIFICATION FOR RECRUITMENT OF THE CANDIDATES FOR THE VARIOUS POSTS ON OUT-SOURCING BASIS UNDER APCOS

S.No.1 : Name of the post : **PUBLIC HEALTH WORKERS/SWEEPER, Number of Vacancies : 49,** Age limit : 18-42 Years, Qualification : Able to read and write in telugu Language.
S.No.2: Name of the post : **UGD WORKER, Number of Vacancies : 01,** Age Limit : 18-42 Years, Qualification : Able to read and write in Telugu Language.
S.No.3 - Name of the post : **COMPUTER OPERATOR , Number of Vacancies : 04,** Age limit : 18-42 Years, Qualification : Any Degree / Diploma in Computer Science and above from recognized University with PGDCA, Type Writing Higher in English (80 words per min) & Lower in Telugu.
S.No.4- Name of the post : **DRIVER, Number of Vacancies : 03**
Age Limit : 18-42 Years, Qualification : 7th Class or Above, able to read and write in Telugu Language, having valid Heavy vehicle Driving License (3 Years Experience) and At Least 1 Year driving experience.
S.No.5: Name of the post : **WORK INSPECTOR,** Number of Vacancies : 01, Age Limit : 18-42 Years, Qualification : Any Degree/ Diploma in ITI and above from recognized university .
S.No.6 - Name of the post : **ELECTRICIAN , Number of Vacancies : 01,** Age Limit -18-42 Years, Qualification : Any Degree / Diploma in ITI and above from recognized University.
S.No.7 - Name of the Post : **FITTER, Number of Vacancies : 01**
Age Limit : 18-42 Years, Qualification : Any Degree/ Diploma in ITI and above from recognized University .
S.No.8 - Name of the Post : **NON PUBLIC HEALTH WORKERS Number of Vacancies : 13,** Age Limit : 18-42 Years, Qualification : Able to read and write in telugu Language.
S.No.9 - Name of the Post : **WATCHMAN, Number of Vacancies : 05**
Age Limit : 18-42 Years, Qualification : Able to read and write in telugu Language. Opening date for Receiving application is 04.09.2025 (10.30 AM) Last date for Receiving application is 09.09.2025 (5.30 PM)

Sd/- Commissioner, Municipal Corporation, Eluru.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి (MACT) పశ్చిమ గోదావరి, ఏలూరు.

M.V.O.P.No.89/2025

తునకపాటి కరుణశ్రీ అండ్ 3 అదర్స్
...పిటీషనర్స్
మరియు
కోటి సురేష్ అండ్ 2 అదర్స్ మరియు వగైరాలు
...రెస్పాండెంట్లు

పై నంబర్ గ్రంథమును పిటిషనర్స్ తేది.1-10-2024వ కొవ్వలి గ్రామము, దెందులూరు మండలములో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన పిటీషనర్ భర్త మరణానికి నష్టపరిహారము గా రూ.15,00,000/- రూ॥ వడ్డీతో సహా ఇప్పించమని మోటార్ సైకిల్ నెంబరు AP 37 BP 0646 ఓనర్ అయిన రెండవ రెస్పాండెంటు వెలమాటి అశోక్ చక్రధర్, S/o.పాండురంగారావు ఓనర్ ఆఫ్ మోటార్ సైకిల్ AP 37 BP 0646, D.No.5-171, కొవ్వలి విలేజ్, దెందులూరు మండలం, ఏలూరు జిల్లా. అనువారికి ఏ విధమైన అభ్యంతరములు ఉన్న ఎడల తేది.18-09-2025 తేదీన ఉదయం 10 గం॥ 30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలను తెలియజేసుకోవలెను. లేనిఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

అంబుల వెంకట నారాయణ
న్యాయవాది, ఏలూరు.
సెల్: 9848422155

వ్యకాస మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కలిదిండి

వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులుగా జమ్ము దుర్గ, ఎస్ఎన్‌వి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆ సంఘం ఏడో మహాసభ గురువారం నిర్వహించారు. 14 మందితో నూతన కమిటీ ఏర్పడింది.

In the court of the principal civil judge (Junior Division) at Tanuku

E.P.No.33/2025 in O.S.No.367/2023

Between:
Borsu Veera Venkata Subrahmanyam
...D.H.R./ Plaintiff
And
Reddy Veera Venkata Satyanarayana
...JDR/Defendant

DHR వాది తరపున చేసిన ప్రకటన

JDR :
రెడ్డి వీరవెంకట సత్యనారాయణ,
S/o.వీరరాఘవులు, పురుషుడు, 55 సం॥లు,
బిజినెస్, R/o.D.No.3-24/1, కెనాల్ వీధి,
వేల్పూరు గ్రామం, తణుకు మండలం, ప.గో.జిల్లా.

పై నంబరు E.P గ్రంథములో మీరు JDR అయివున్నారు. పై నంబరు EP గ్రంథములో శ్రీకోర్టు వారి ఆదేశం ప్రకారం మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశం ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ఏమనగా మీరు ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి 30 రోజులలోగా మీరు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరై మీ తాలుకా ఆక్షేపణలు తెలియజేయవలసినదిగాను, అట్లు కాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

NEELAM HARISH NAIDU
Advocate, Tanuku.
Cell: 9293222187.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.84/2013 in O.S.No.151/2007

Between:
1.కోనాల వీరవెంకట సత్యనారాయణ రెడ్డి (Died)
2.కోనాల వెంకటరెడ్డి ...పిటీషనర్లు/డిక్రీ హోల్డర్
(As per order in E.A.72/2024 dated 07-05-2024 sole DHR is added)
And
రేపాక ఆనందరావు
...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టర్

To.
రేపాక ఆనందరావు, తండ్రి ఇశ్రాయేల్, వయస్సు 55 సం॥లు, పురుషుడు, వ్యాపారం, దిగమర్రు, పాలకొల్లు మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డేటర్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని ది.24-09-2025వ తేదీన ఉ.గం.10.30 ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

West Godavari, Palakol Sub Registration District, Palakol Mandal, Digamarru village an extant of zeroyat wet land Ac.0-10 cents of Southern side Ac.0-50 cents out of western side Ac.1-00 cents out of full Ac.19-30 cents in R.S.No.312 of land with in the following boundaries.
East : Land of Repaka Kasulu
West: Land of Kollabattula Mary Suseela
South: Murugu Canal
North: Remaining land of Repaka Ananda Rao (JDR) in R.S.No.312.
With in the boundaries an extant of Ac.0-10 cents of land with all trees bearing with easementary right.
D.H.R Value Rs.1,90,000/-
Amin Value Rs.2,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు న్యాయవాది,
తేది.02-09-2025 పాలకొల్లు, ప.గో.జిల్లా.

యూరియా కోసం రైతుల పాట్లు

సొసైటీ వద్ద గంటల పాటు నిరీక్షణ
ప్రయివేట్ దుకాణాల్లో నెల రోజులుగా నిల్

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో యూరియా ఎరువు కొరత తీవ్రంగా ఏర్పడింది. సార్వా వరి పైరుకు అత్యంత అవసరమైన సమయంలో యూరియా ఎరువు కొరత ఏర్పడడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. యూరియా కోసం రైతులు ప్రయివేట్ దుకాణాల వద్ద, సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారు. మండలవ్యాప్తంగా సుమారు 14 వేల పైచిలుకు ఎకరాల్లో సార్వా వరి సాగు చేస్తుండగా ఎక్కువ శాతం రైతులు వెదజల్లిన వరి పైరుకు తొలి యూరియా వాడకం పూర్తయింది. రెండో విడత చల్లేందుకు యూరియా కొరత ఏర్పడింది. నాట్లు వేసిన భూములకు కూడా యూరియా అవసరమైన పరిస్థితుల్లో యూరియా లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నడూ లేని విధంగా మండలంలోని ఎరువుల షాపుల వద్ద, సొసైటీలు వద్ద యూరియా కోసం రైతులు ప్రతినిత్యం ఎదురుచూస్తూ పడిగాపులు పడుతున్నారు. గురువారం వడాలి సొసైటీకి 12.5 టన్నులు యూరియా రావడంతో రైతులు ఎగబడ్డారు. దీంతో సొసైటీ వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తోపులాటలు, రైతులు మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఉదయం పది గంటలకు

వడాలి సొసైటీ బయట యూరియా కోసం పడిగాపులు

యూరియా లోడ్ రాగా రైతుల పెద్ద ఎత్తున సొసైటీ వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలు దాటినా యూరియా బస్తా ఇవ్వకపోవడంతో సొసైటీ సిబ్బందిపై రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ప్రస్తుతం మండలంలో 36 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు వ్యవసాయ శాఖాధికారి వేణుమాధవ్ తెలిపారు. ప్రస్తుతం వడాలి, వాడవల్లి సొసైటీల్లో మాత్రమే యూరి యా అమ్మకాలు చేస్తున్నట్లు చెప్పారు. శ్రీహరిపురం మన గ్రోమోర్‌లో కూడా యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇతర మండలాలకు చెందిన రైతులకు కూడా యూరియా విక్రయిస్తున్నందున కొరత ఏర్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం : ఎఒ వేణుమాధవ్

యూరియా కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎఒ వేణుమాధవ్ తెలిపారు. ఇప్పటివరకు 80 శాతం మేర యూరియాను రైతులకు ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా మండలానికి 20 శాతం మాత్రమే రావాల్సి ఉందన్నారు. ఎనిమిది సొసైటీల్లో యూరియా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. డిమాండ్ సరిపడ రానందున కేటాయించిన యూరియాను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

చింతలపూడి : లింగపాలెం డిసిఎంఎస్ వద్ద యూరియా కోసం వందలమంది రైతులు పడిగాపులు కాస్తూ పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి పంటకు యూరియా అత్యవసరమని, ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు. అవసరం మేరకు యూరియా ఇవ్వకపోతే పంటలు ఎలా పండించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసినా ఎవరూ పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. ఆగస్టు 31వ తేదీ నాటికి యూరియా సమస్య తీరిపోతుందని అధికారులు చెప్పారని, సెప్టెంబర్ నెల వచ్చి నాలుగు రోజులు గడిచిపోయినా సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. అవసరం మేరకు యూరియా కట్టలు రైతులకు అందించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

యూరియాపై రాయితీ తగ్గించేందుకు కేంద్రం కుట్ర

ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం యూరియాపై సబ్సిడీ తగ్గించుకునేందుకు చేస్తున్న కుట్రలో భాగంగానే యూరియా దిగుమతి చేసుకోకుండా కొరత సృష్టిస్తోందని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు తీవ్రంగా విమర్శించారు. గురువారం ఏలూరులోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యూరియాపై సబ్సిడీని కుదించి వేసిందన్నారు. రాష్ట్రానికి సరిపడా యూరియా అందించని కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయకుండా ముఖ్యమంత్రి ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తగదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సొసైటీలు, ఎరువుల షాపుల ముందు రైతులు క్యూలు కట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. పైగా ఇప్పుడు ఆధార్‌తో లింకు పెట్టి యూరియా ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. రైతులకు నానో యూరియా అంటగట్టడం తగదన్నారు. ప్రస్తుతం వర్షాలు పడి ఎరువులు చల్లుకోవాల్సిన సమయంలో యూరియా కొరత సృష్టించడం దారుణమన్నారు. ఇప్పటికైనా రైతులకు అవసరమైన యూరియాను అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గుంతకల్లు ఎంఎల్ఎ క్షమాపణ చెప్పాలి

అనంతపురం జిల్లాలో సోలార్ ఎనర్జీ కంపెనీలకు సేకరిస్తున్న భూముల పరిశీలనకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డికి గుంతకల్లు ఎంఎల్ఎ జి.జయరాం ఫోన్ చేసి దూషించడాన్ని కేశవరావు తీవ్రంగా ఖండించారు. దురుసుగా, అవమానకరంగా మాట్లాడిన గుంతకల్లు ఎంఎల్ఎ తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఎల్‌టిఆర్ భూములను ఆర్‌అండ్‌ఆర్‌లో కొనుగోలు చేయొద్దు : సిపిఎం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజన సాగులో ఉన్న 1/70 ఎల్‌టిఆర్ భూములను ఆర్‌అండ్‌ఆర్‌లో కొనుగోలు చేయొద్దని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం ముఖ్య నేతల సమావేశం రేగులకుంటలో జిల్లా కమిటీ సభ్యురాలు తామా ముత్యాలమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సూర్యచంద్రం, కుంజా లక్ష్మణరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

కోకో రైతులంతా సంఘటితం కావాలి

రాష్ట్ర సదస్సులో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెదవేగి

కోకో రైతులు రాష్ట్రవ్యాప్తంగా సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎబి.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. విజయరాయి గాంధీనగర్‌లోని సీతారామ కళ్యాణమండపంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పిఒ) ఏర్పాటుకు కోకో రైతుల రాష్ట్ర సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. కోకో రైతుల సమస్యలపై ఈ కాలంలో చేసిన కార్యక్రమాల నివేదికను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. ఈ సదస్సులో ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీలు కోకో రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వకుండా మోసగిస్తున్నాయని విమర్శించారు. కోకో రైతుల ఉద్యమ ఫలితంగానే కిలో కోకో గింజలకు రూ.500 ధర ఇచ్చారని చెప్పారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.50 ప్రోత్సాహంగా ఇవ్వడం కోకో రైతులకు ఇష్టం లేదన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ కోకో బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిసిఆర్ఐ కాసర గోడ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పి.చౌడప్ప, నాబార్డ్ ఎజిఎం ఎం.రాజశేఖర్‌రెడ్డి, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ మునిరెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఎస్.రామ్మోహన్, కొబ్బరి రైతుల ప్రాంతీయ

కోకో రైతుల రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న నేత

సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మున్నంగి సుబ్బారెడ్డి, పెదవేగి ఆయిల్ పామ్ రైతుల సంఘం అధ్యక్షులు ఉండవల్లి వెంకటరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు గుదిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్ బాబు, పానుగంటి అచ్యుతరామయ్య, ఉప్పల కాశీ, ఉప్పుగంటి భాస్కరరావు, యలమాటి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న భూసేకరణలో జిల్లా అధికారులు చేస్తున్న ప్రకటనలకు, మాటలకు అక్కడ జరుగుతున్న దానికి అసలు పొంతనే లేదని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం మీడియాతో మాట్లాడారు. పోలవరం నిర్వాసితుల కోసం చేస్తున్న భూసేకరణలో అధికారులు చెప్పేదొకటి, అక్కడ జరిగేది మరొకటన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఇంతకుముందే భూసేకరణ చేశామని, మిగులు భూములు ఉన్నాయని ప్రకటించిన అధికారులు వాటి లెక్కలు, వివరాలు తెలపలేదని, అప్పుడే ఆ భూసేకరణ సందర్భంగా దాదాపు రూ.500 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఇప్పుడు తిరిగి మరొక ఎనిమిది వేల ఎకరాలు భూసేకరణ కోసం ప్రభుత్వం, జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అవసరమయ్యే భూములు సేకరించాలని, వారికి భూమికి భూమి ఇవ్వాలని, కాలనీలు నిర్మించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిపిఎం కూడా పోరాడుతుందని స్పష్టం చేశారు. అయితే ఏజెన్సీ ప్రాంతం 1/70 చట్ట పరిధిలోనిదని, షెడ్యూల్ ప్రాంతమని, రాష్ట్రపతి, గవర్నర్ ఆదేశాల్లో ఉండాల్సిన ప్రాంతమని, గవర్నమెంట్, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఉండాల్సిన ప్రాంతమని తెలిపారు. ఈ ప్రాంతంలో భూసేకరణ చేస్తే గ్రామసభలు పారదర్శకంగా జరిపి, గిరిజనేతర భూస్వాముల భూములను సేకరిస్తే భూసమస్య ఉండదని రవి స్పష్టం చేశారు. అలాకాకుండా ఈ ప్రాంతంలో భూసేకరణ తూతూమంత్రంగానే నడుస్తుందని, గిరిజనేతర భూస్వాములతో, అధికార పార్టీ నాయకులతో కొంతమంది జిల్లా అధికారులు కుమ్మక్కై, వారిచ్చే లంచాలు తీసుకుని తప్పుడు రికార్డులతో గిరిజనులు సాగు చేస్తున్న భూములు, ఎల్‌టిఆర్ భూములు, గిరిజనుల అనుభవంలో ఉన్న భూములను సేకరించి స్థానిక గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. దాదాపుగా 10 సంవత్సరాల నుండి ఇదే సమస్యపై సిపిఎం గిరిజనుల పక్షంగా పోరాడుతుందని, కోర్టుల్లో వివాదాలు నడుస్తున్నాయని, అయినా తిరిగి మళ్లీ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం భూసేకరణ పేరుతో తప్పుడు పద్ధతిలో అధికారులు వ్యవహరించడం అన్యాయమని, బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో ఇటీవల తహశీల్దార్ ఇద్దరు ముగ్గురు రైతులను కూర్చోబెట్టి, గ్రామసభ బ్యానర్ పెట్టి వ్యవహారం నడిపిస్తున్నారని, ఇది తెలిసిన గ్రామ ప్రజలు నిలదీయడంతో బ్యానర్ తీసివేసి ఇది భూసేకరణకు పెట్టిన గ్రామసభ కాదని బుకాయించే ప్రయత్నాలు చేశారని గుర్తు చేశారు. ఈ వ్యవహారాన్ని జిల్లా ఉన్నతాధికారులైన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. గ్రామంలో టముకు వేయించి, ప్రజలందరినీ ఆహ్వానించి, వచ్చిన ప్రజలకు ఏఏ భూములు సేకరించేది, మీకు అభ్యంతరాలు ఉంటే చెప్పండి అని అడిగే కార్యక్రమంగా గ్రామసభలు జరపకుండా తూతూమంత్రంగా గ్రామసభలు జరిపేయడం దారుణమన్నారు. పారదర్శకంగా గ్రామసభలు జరిపిస్తామని, ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామని, గిరిజనుల సాగులో ఉన్న భూములుగాని, కోర్టు వివాదాల్లో ఉన్న భూములుగాని సేకరించబోమని, గిరిజనేతరుల భూములను మాత్రమే సేకరిస్తామని జాయింట్ కలెక్టర్ చేసిన ప్రకటనను సిపిఎంగా స్వాగతిస్తున్నామన్నారు. వాస్తవానికి ఇవి ప్రకటనలుగానే మిగిలిపోతున్నాయని, ఏజెన్సీలో జరుగుతున్నది మరొకటని అన్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో సర్పంచులు, పీసా కమిటీ సభ్యుల వద్దకు అధికారులు వెళ్లి, ఒత్తిడి తీసుకువచ్చి, బెదిరించి సంతకాలు చేయమనడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. జిల్లా అధికారులు ప్రాథమిక నోటిఫికేషన్‌లో ప్రకటించిన భూముల్లో కొంతమంది గిరిజనులకు పట్టాలు ఉన్నాయని, ఆ భూముల్లో గిరిజనులు 20 నుండి 30 ఏళ్లుగా సాగులో ఉన్నారని, ఆ భూముల్లో కొన్ని ఎల్‌టిఆర్ భూములు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విషయాలు రుజువు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఏజెన్సీ ప్రాంత చట్టాల ప్రకారం సమస్యను జిల్లా అధికారులు పరిష్కరించాలని, గిరిజనుల హక్కులు కాపాడాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో సిపిఎంగా గవర్నర్‌తోపాటు రాష్ట్రపతి దృష్టికి కూడా ఏజెన్సీలో జరుగుతున్న వ్యవహారాలను తీసుకెళ్తామని హెచ్చరించారు.

నేరాలు - ఘోరాలు

పంట నష్టం రావడంతో...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పంట నష్టం రావడంతో మనస్తాపానికి గురైన కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చింతలపూడి మండలం నరసింహాపురంలో చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నరసింహపురం గ్రామానికి చెందిన మాదాసు సూరిబాబు (45) స్థానికంగా రెండు ఎకరాలు సొంత పొలంతో పాటు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు అతను వేసిన మొక్కజొన్న పంట మొత్తం నీటిపాలైంది. దీంతో అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో బుధవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు వెంటనే ఆయనను చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం గురువారం మధ్యాహ్నం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ముఠాలోని ఆరుగురిలో ఇద్దరు బాలురు ఉన్నారు. నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం సిఐ కోటేశ్వరరావు విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఒకటో పట్టణ ప్రాంతానికి చెందిన విప్పర్తి సత్యరూప్‌కుమార్ (సతీష్), కొమ్మిన మణికంఠ, తమ్మిశెట్టి రామ్‌చరణ్, అల్లంపల్లి రాజేష్‌తో పాటు మరో ఇద్దరు బాలురు ఓ ముఠాగా ఏర్పడి గంజాయి రవాణా చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఆరుగురు గంజాయిని విక్రయించేందుకు ద్విచక్రవాహనాలపై ఉండగా మూడో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మూడు కేజీల 460 గ్రాముల గంజాయిని, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఆదర్శ ప్రజానేత.. ఆర్‌ఎస్

పేదల, అణగారిన వర్గాలైన బడుగు, బలహీనవర్గాల పక్షపాతి. ఉద్యమాల్లో ధీరోదాత్తుడు.. నిరంతర స్ఫూర్తిదాయకులు కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) భౌతికంగా మనకు దూరమై నేటికి (సెప్టెంబర్ 5) సంవత్సరమైందంటే నమ్మశక్యంగా లేదు. ఆయన రూపం.. గంభీర మాటలు ఇంకా కళ్ల ముందు కదలాడుతూ మదిలో మెదులుతూనే ఉన్నాయి.

బి.బలరాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

నేడు ప్రథమ వర్ధంతి

ఉత్తమ ప్రజా నాయకునికి, కమ్యూనిస్టు నేతకు ఉండాల్సిన అన్ని మంచి లక్షణాలు కామ్రేడ్ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్)కు పుష్కలంగా ఉన్నాయి. సమస్యలపై తనకు తానుగా చొరవతో స్పందించడం, పార్టీ శ్రేణులను ధైర్యంతో.. ఉత్తేజంతో కార్యాచరణలోకి దించడం ఆయనకున్న ప్రత్యేక లక్షణం. అందుకే సమస్యలతో సతమతమయ్యే వివిధ తరగతుల ప్రజల మన్ననలు ఆయన పొందగలిగారు. సమస్యలపై పని చేయాల్సిన కార్యకర్తలు కర్తవ్య నిర్వహణలో నిమగ్నమై కార్యశీలురుగా ఉత్సాహం, ఉత్తేజం పొందేవారు. కష్టాలొచ్చినప్పుడు కుంగిపోకుండా ఆటుపోట్లు తట్టుకునేలా రాటుదేలిన ఆయన కార్యకర్తలను అదే స్ఫూర్తితో రాటుదేలేలా చేశారు. చించినాడ అమరవీరుల స్ఫూర్తితో ప్రారంభమైన ఆయన ఉద్యమ ప్రస్థానం కడవరకూ అదే పంథాలో ఉత్తేజపూరితంగా సాగింది. చించినాడ, కలగంపూడి, కాజ గ్రామాల్లో పేదల పోరాటానికి నాంది ప్రస్తావన నుండి పేదలు తమ ఆత్మగౌరవాన్ని, హక్కులను నిలబెట్టుకునేలా సాగిన పోరాటంలో పడ్డ కష్టాలు, ఎదుర్కొన్న నిర్బంధం, కేసులు, జైలు జీవితం దీనికి తార్కాణం. కామ్రేడ్ ఆర్‌ఎస్‌తోపాటు కామ్రేడ్ కేతా సూర్యారావు, కామ్రేడ్ పోతురాజు కృష్ణారావు, కామ్రేడ్ మల్లుల వెంకట్రావు, కామ్రేడ్ మల్లుల సత్యం, కామ్రేడ్ పెచ్చెట్టి బాబ్జీ, కామ్రేడ్ తెన్నేటి సంపతరావు, కామ్రేడ్ రుద్రరాజు సూర్యనారాయణరాజు, కామ్రేడ్ పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, కామ్రేడ్ గంటా దీనమ్మ, కామ్రేడ్ కేతా చారుమతి, కామ్రేడ్ చింతపల్లి చంద్రరావు, కామ్రేడ్ బూసి శారమ్మ, కామ్రేడ్ బుడితి వజ్రమ్మ, కామ్రేడ్ చిట్టూరి శేషమ్మ, కామ్రేడ్ మునగాల గాంధారి, కామ్రేడ్ వేండ్ర మహాలక్ష్మి వంటి అనేకమంది ఆణిముత్యాలు ఈ పోరాటం నుండే అభివృద్ధి అయ్యారు. ఉద్దరాజు రామం, అల్లూరు సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు, అన్నే అనసూయ, దిగుపాటి సాల్మన్‌రాజు, మహ్మద్ మీరా, అల్లూరు మన్మోహిని (అమ్మాజీ) వంటివారు ఈ పోరాటానికి, ప్రజలకు నాయకత్వం వహించి దన్నుగా నిలబడ్డారు.

చించినాడ పేదల పోరాటం, అమరవీరుల-బలిదానం, అమరజీవుల కృషి చించినాడను జిల్లాలో, రాష్ట్రంలో ఒక గొప్ప పోరాట గ్రామంగా.. కొన్ని దశాబ్దాలపాటు ఆదర్శ పంచాయతీగా, ఆదర్శ సొసైటీగా గుర్తింపును పొందేలా నిలబెట్టాయి.

కార్యకర్తలకు ఆత్మీయ పలకరింపు.. ఇతరులతో మంచి సంబంధాలు

ఎంత పని ఒత్తిడిలో ఉన్నా పార్టీ సభ్యులు, కార్యకర్తల కుటుంబాలతో ఆర్‌ఎస్ ఆప్యాయత, ప్రేమపూర్వక సంబంధాలు నిరంతరం సాగించేవారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చేవారు. అవసరమైన సహాయం అందించేవారు. ఈ తీరు ఎంతగానో ఆకట్టుకునేది. కార్యకర్తలకు, కిందిస్థాయి నాయకులకు ఒక భరోసాగా ఉండేది.

ఇతర రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు నాయకులతోనూ స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేవారు. తాను బాధ్యత చూస్తున్న సిపిఎం సిద్ధాంతం, ఆచరణ, వర్గ దృక్పథానికి ఏమాత్రం భంగం కలగనిచ్చేవారు కాదు. అందుకే ఇతరులను ఆకట్టుకునేవారు. గౌరవం పొందేవారు. ఇతర పార్టీల నాయకులు కూడా ఎంతగానో అభిమానించేవారు.

ఆర్థిక వనరుల సేకరణలో దిట్ట.. ఆదర్శ ప్రజాప్రతినిధి

పార్టీకి ఆర్థిక వనరులు సమకూర్చడంలో, దాతల నుండి విరాళాల సేకరణలో తాను స్వయంగా ముఖ్యపాత్ర వహించి కార్యకర్తలకు, కిందిస్థాయి నాయకులకు నేర్పేవారు. పార్టీకి ఆర్థిక లోటు లేకుండా నిరంతరం మంచి కృషి చేసేవారు.

ప్రజాప్రతినిధిగా ఎంతో ఆదర్శవంతమైన కృషి చేశారు. చించినాడ గ్రామ పంచాయతీ అధ్యక్షునిగా (సర్పంచి) మొదలు నర్సాపురం ఎంఎల్‌ఎ (1967 నుంచి 1972 వరకూ)గా, కొంతకాలంపాటు సిపిఎం శాసనసభాపక్ష ఉప నాయకునిగా, నాయకునిగా ఆయన కృషి ఎంతో చెప్పుకోదగ్గది. సమస్యలను సూటిగా ప్రస్తావించడం, చర్చించడంతో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి దృష్టిని సైతం ఆకర్షించారు. ఆకట్టుకున్నారు.

ప్రజాక్షేత్రంలో డైనమిక్ నాయకునిగా, పార్లమెంటరీ రంగంలో ఆదర్శవంతమైన ఉత్తమ ప్రజాప్రతినిధిగా పేరు తెచ్చుకున్నారు.

జిల్లా పార్టీ నిర్మాణంలో ముఖ్యపాత్ర

జిల్లాలో పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో ప్రేరేప మృత్యుంజయుడు, ఎస్‌ఆర్.దాట్ల, ఉద్దరాజు రామం, అల్లూరు సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు, అనసూయ, దిగుపాటి సాల్మన్‌రాజుతోపాటు ముఖ్యపాత్ర పోషించారు. 1980కు ముందు పాత నర్సాపురం తాలూకాతోపాటు 1980 తర్వాత నిర్మాణ రీత్యా ఏర్పడిన నర్సాపురం-భీమవరం డివిజన్, భీమవరం-తణుకు డివిజన్లలో సిపిఎం నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. శాఖలను, సభ్యులను, కార్యకర్తలను కమిటీలను చురుగ్గా కదిలించడం, క్రియాశీలంగా చురుకైన పాత్ర నిర్వహించేలా, సమరశీలంగా (మిలిటెంట్) ఉద్యమాలు నిర్వహించేలా ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర వహించారు. జిల్లాలో కార్మిక నేతగా ముఖ్యపాత్ర పోషించారు. తదనంతరం పార్టీ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా జిల్లా పార్టీ, ఉద్యమాల నిర్మాణంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోనూ ఆర్‌ఎస్ ముఖ్యపాత్ర వహించారు.

రైతు నేతగా..

జిల్లా రైతు ఉద్యమ నిర్మాణంలో ఆర్‌ఎస్ ప్రధాన పాత్రధారి, న వా ర్ త ధా రి. భోగవల్లి రాజారావు అధ్యక్షులుగా, ఆర్‌ఎస్ కార్యదర్శిగా జిల్లా రైతు ఉద్యమం 1982లో పున:నిర్మాణం జరిగింది. రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా పని చేశారు. జిల్లాలో దేవాలయ కౌలురైతులు, పలు అఖిలపక్ష రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. వరదలు, తుపాన్లు సంభవించినప్పుడు, ఉప్పుటేరు, కొల్లేరు, గోదావరి పెరుగు లంకల భూములు, ఏజెన్సీ ప్రాంత గిరిజన, గిరిజనేతర పేద రైతులు, పేదల సమస్యలపై జరిగిన ఉద్యమాల్లో ముఖ్యపాత్ర పోషించారు. పాలకొల్లు చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై నాటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావును స్వయంగా కలిసి ఒప్పించారు. తరువాత కాలంలో చక్కెర మంత్రి పెన్మెత్స సాంబశివరాజుతో యూనియన్‌పరంగా చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారు.

అధికార పక్ష నాయకుడు కాకపోయినా జిల్లాలో సిపిఎం బలం రీత్యా చిన్న రాజకీయ పక్షమే అయినా తన చొరవ, పట్టుదల, అంకితభావం, సమరశీలతతో జిల్లాలో ఒక డైనమిక్ లీడర్‌గా ఎదిగి గుర్తింపు పొందారు. 1989లో తెలుగుదేశం సీట్ల సర్దుబాటుతో సిపిఎంకు నర్సాపురం స్థానం ఖరారైంది. ఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి పార్టీ రాష్ట్ర కమిటీ ఖరారు చేసింది. దీంతో ఉలిక్కిపడ్డ నాటి తెలుగుదేశం జిల్లా అగ్ర నాయకత్వం, హేమాహేమీలు ఆగమేఘాలపై రంగంలోకి దిగి ఎన్‌టి.రామారావు వద్దకు రాయబారం నడిపి ఆ స్థానం సిపిఎంకు ఇవ్వకుండా రద్దు చేయించారంటే ఆర్‌ఎస్ జిల్లా రాజకీయాలను ఎంత ప్రభావితం చేయగల నాయకుడో అర్థమవుతుంది. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా భూమిలేని పేదల విముక్తి కోసం ఆయన చేసిన ఉద్యమ కృషి ఎంతో ఆదర్శవంతమైంది. సంప్రదాయ, ఘోషా కుటుంబం నుండి వచ్చిన సూర్యాకాంతంను వివాహమాడి ఆమెను కూడా మహిళా ఉద్యమ నాయకురాలిగా ప్రోత్సహించి తీర్చిదిద్దారు.

పార్టీ కోసం నిరంతర తపన..

ఐదు సంవత్సరాలుగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమైనా ఆర్‌ఎస్ లాంటి పెద్దదిక్కు లేని లోటు జిల్లాలోని సిపిఎంకు స్పష్టంగా కన్పిస్తోంది. శరీరం సహకరించకపోయినా చివరి వరకు ప్రజల పట్ల, పార్టీ పట్ల, కార్యకర్తల పట్ల, నమ్మిన సిద్ధాంతం, ఆశయం, పట్టిన ఎర్రజెండా పట్ల అచంచలమైన నమ్మకం, దృఢ విశ్వాసంతో ఉన్నారు. తమ్ముని కుమారుడు, చించినాడ మాజీ సర్పంచి ఆర్.సత్యనారాయణరాజు, కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, ఇతర కుటుంబ సభ్యులు నిరంతరం ఆయన పట్ల ఎంతో ఆప్యాయత, అనురాగం, శ్రద్ధ కనబర్చారు. సహాయ కురాలిగా ఉన్న విజయ ప్రత్యేక సేవలందించారు. కలగంపూడి, వైవి.లంక, కాజ, గొంది, చించినాడ కామ్రేడ్స్, రైతుమిత్రులు, వివిధపేటల ప్రజలతో ఆయనది ప్రత్యేక ప్రేమపూర్వక ఉద్యమానుబంధం. జిల్లాలోని కామ్రేడ్స్ అందరితోనూ ప్రత్యేక అనురాగంతో ఉండేవారు. పార్టీ నిర్ణయాలను పట్టుదల, దీక్ష, చైతన్యంతో అమలు చేయడం, వెంటపడి అమలు చేయించడం ఆర్‌ఎస్ ప్రత్యేకత. కామ్రేడ్ ఆర్‌ఎస్ లేని లోటు చించినాడ ఉద్యమానికి, జిల్లా పార్టీకి, ప్రజా ఉద్యమాలకు పూడ్చలేనిది. ఆయన పట్టుదలతో సాగించిన కృషిని అందరం మరింత పట్టుదలతో కొనసాగించడం, ఎర్రజెండాను కాంతివంతంగా, సమున్నతంగా నిలబెట్టడం ద్వారా నిజమైన నివాళులర్పిద్దాం. కామ్రేడ్ ఆర్‌ఎస్‌గార్కి సిపిఎం తరపున అరుణాంజలి. ఆయన ఆశయ సాధనకు మరింత సమరశీలతతో ముందుకు సాగుతామని ప్రతినబూనుదాం.

నేడు ప్రథమ వర్ధంతి
8న చించినాడలో సభ

ఆర్‌ఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అంతటా పార్టీ శ్రేణులు ఆయన ఆశయానికి పునరంకితమౌతూ ఘనంగా నివాళులర్పిస్తున్నాయి. 8వ తేదీన చించినాడలో సంస్మరణ సభ నిర్వహించనున్నారు. ఆయన నుండి నిత్యస్ఫూర్తిని పొందేలా త్వరలోనే చించినాడలో విగ్రహ ఏర్పాటుకు చించినాడలోని సిపిఎం గ్రామ కమిటీ సన్నాహాలు చేస్తోంది.

పెరిగి తగ్గుతున్న గోదావరి వరద

ముంపులోనే గుండేటి వాగు, పాలవాగు, ఎద్దువాగు కాజ్‌వేలు

భద్రాచలంలో గోదావరి వరద తగ్గుముఖం

కుక్కునూరు-దాచారం మధ్య రోడ్డుపై వరద నీరు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గోదావరి వరద ఉధృతి గురువారం సాయంత్రం తగ్గుముఖం పట్టింది. బుధవారం సాయంత్రం వరకూ తగ్గుముఖం పట్టిన తర్వాత అనూహ్యంగా పెరిగిన సంగతి తెలిసిందే. దీంతో భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరిక సైతం జారీ చేశారు. తర్వాత గురువారం మధ్యాహ్నం నుంచి తగ్గుముఖం పట్టడంతో మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. గోదావరి వరద ఈసారి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరి ఉధృతి కొనసాగింది. కుక్కునూరు మండలంలో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వే ముంపులోనే ఉంది. ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వేపైకి గురువారం వరద నీరు చేరింది. దీంతో మూడు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచాయి. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరేందుకు 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది.

కోడేరులో తగ్గిన గోదావరి

పోలవరం నుండి 9,31,017 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం: గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రం తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,31,017 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.350 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.740 మీటర్లు, ఎగువ కాపర్‌డ్యామ్ ఎగువన 33.100 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 23.300 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య 16.020 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు.

వశిష్ట గోదావరి తగ్గుముఖం

ఆచంట: ఉగ్రరూపం దాల్చిన వశిష్ట గోదావరి క్రమంగా శాంతిస్తోంది. మూడు సార్లు పెరుగుతూ, తగ్గుతూ లంక గ్రామాల ప్రజలను వణికించింది. దీంతో లంకల్లో సాగు చేస్తున్న పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గోదావరి పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముంపులో ఉన్న ఆయా లంకవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గడిచిన 24 గంటల్లో మూడు అడుగుల మేర గోదావరి నీటిమట్టం తగ్గింది. గోదావరి తగ్గుముఖం పట్టడంతో లంక వాసులకు, కోడేరు భీమలాపురం గోదావరి పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

యలమంచిలి: గత వారం రోజులకుపైగా లంక గ్రామాల ప్రజలను భయపెట్టిన గోదావరి వరద ఉధృతి తగ్గడంతో లంక గ్రామాల ప్రజలు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే వరద తగ్గినా రహదారులపైకి చేరిన బురద మాత్రం ఎక్కడికక్కడ పేరుకుపోయింది. దీంతో లంక గ్రామాలైన లక్ష్మీపాలెం, కనకాయలంక, బాడవ, పెదలంక తదితర గ్రామాల్లో ఆయా పంచాయతీ అధికారులు బురదను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు

జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి

తనిఖీ చేస్తున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వీరవాసరం

జిల్లాలో యూరియా కొరత లేదని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. వీరవాసరంలో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించి కొన్ని ప్రయివేటు ఎరువుల దుకాణాలను, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అలాగే శ్రీనివాస ట్రేడర్స్, సాయి లక్ష్మి ఫెర్టిలైజర్స్, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించిన గొడౌన్లను జెసి తనిఖీ చేసి వారికి పలు సూచనలు చేశారు. యూరియా నిల్వలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడి యూరియా ఏ విధంగా వాడుతున్నారు, ఎంత మేరకు అవసరమవుతోంది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకే రైతులు యూరియాను వాడాలని రైతులకు సూచించారు. అవసరానికి మించి సాగుకు యూరియా వాడితే చేలను ఇతర తెగుళ్ల ఆశిస్తాయన్నారు. జిల్లాలో ఎరువుల నిల్వలు సొసైటీలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందొద్దని పిఎసిఎస్‌లో అవసరమైన యూరియా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. బయట వదంతులు నమ్మొద్దన్నారు. ఒక వ్యవసాయ అనుబంధ పంటలకు మాత్రమే యూరియా ఇవ్వాలని, చేపల చెరువులకు యూరియా ఇవ్వొద్దని తెలిపారు. రైతు వ్యవసాయ విస్తీర్ణం బట్టి స్టాక్ ఇవ్వాలని సొసైటీలను ఆయన ఆదేశించారు. ఎవరైనా ఎరువుల అమ్మకాల్లో ప్రభుత్వ నియమాలను పాటించకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని జెసి అన్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రామాంజనేయులు, మండల వ్యవసాయ శాఖ అధికారి బిన్సీ బాబు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీజ వివాహానికి సిఎం చంద్రబాబుకు మంత్రి ఆహ్వానం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉండవల్లిలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు కలిశారు. ఈ నెల 24న పాలకొల్లులో జరిగే తన కుమార్తె శ్రీజ వివాహానికి హాజరుకావాలని చంద్రబాబును ఆహ్వానించారు. దీనికి సిఎం చంద్రబాబు అంగీకరించారు.

సిఎంకు పెళ్లి పత్రిక అందజేస్తున్న నిమ్మల

కుసుమకుమారికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

తాడేపల్లిగూడెం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలు ఆచార్య కుసుమ కుమారి ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల్లో ఉన్నత విద్యా కళాశాలల్లో ఇంజినీరింగ్ విభాగంలో ఆమె ఎంపిక కాబడినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఆచార్య కుసుమ కుమారి శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో గత 12 ఏళ్లుగా పని చేస్తూ ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ ఇసిఇ, ఇసిటి విభాగాల అధిపతి (హెచ్‌ఒడి)గా వ్యవహరిస్తున్నారు. వృత్తి పట్ల అంకితభావం, చేసే పనిలో చిత్తశుద్ధి, నిత్యం నేర్చుకోవాలనే తపన, పరిశోధన అంశాల్లో ఆసక్తి వంటి అంశాలే ఆమెను అవార్డుకు ఎంపికయ్యేలా చేశాయని కళాశాల పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన కుసుమకుమారిని కళాశాల పాలకవర్గ సభ్యులతోపాటు ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు, డీన్‌లు డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేష్, వివిధ విభాగాల అధిపతులు, సహచర అధ్యాపకులు తమ అభినందనలు తెలిపారు.

నోరు విప్పి.. సమాధానం దాటవేసి

ప్రజలకు పరిపాలన సౌలభ్యం ఉన్న చోటే కలెక్టరేట్ ఏర్పాటు

రాజకీయాలు, పంతాలు, పట్టింపులకు తావులేదు

కలెక్టరేట్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ

ప్రజాశక్తి - భీమవరం

నూతన కలెక్టరేట్ ఏర్పాటుపై ఎట్టకేలకు కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ నోరు విప్పారు. అయితే స్పష్టత ఇవ్వకుండా సమాధానం దాటవేశారు. పైగా ప్రజలకు పరిపాలన సౌలభ్యం ఉన్న చోటే కలెక్టరేట్ ఏర్పాటు ఉంటుందని చెప్పారు. రాజకీయాలు, పంతాలు, ప్రెస్టేజీలకు తావు లేదని హెచ్చరించారు. ఇటీవల డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు పి4లో కలెక్టరేట్ నిర్మాణం నిమిత్తం శంకుస్థాపనకు రావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో శాసనమండలి ఛైర్మన్‌గా ఉన్న కొయ్యే మోషేన్‌రాజు స్పందించి కలెక్టరేట్ వేరే ప్రాంతానికి తరలిస్తే ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. దీనిపై రఘురామ కృష్ణరాజు 'నేను ప్రభుత్వ భవనాలు నిర్మిస్తాను, ఆపుకుంటే ఆపుకోండి మీ ఇష్టం, జిల్లాలోని ఎంఎల్‌ఎలు అందరికీ చెప్పాల్సిన అవసరం నాకు లేదు. దయచేసి అభివృద్ధిని అడ్డుకోవద్దు' అంటూ ఘాటుగా స్పందించారు. ఈ నేపథ్యంలో వైసిపి జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి కలెక్టరేట్ తరలిస్తే ఊరుకోబోమంటూ స్పష్టం చేసింది. ఇది ఎలా ఉంటే నరసాపురం కేంద్రంగా కలెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు ఆందోళనను ఉధృతం చేశారు. ఇలా జిల్లాలో గత కొన్ని రోజులుగా కలెక్టరేట్ ఏర్పాటుపై తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. అయితే కేంద్ర మంత్రి కనీసం నోరు మెదపడం లేదనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో స్థానిక బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టరేట్ ఏర్పాటుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎట్టకేలకు నోరు విప్పారు. అయితే ఆయన సమాధానం చెప్పకుండా దాటవేశారు. కలెక్టరేట్ ఎక్కడ పెట్టాలి అనేది కాదని కలెక్టరేట్ ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమని చెప్పారు. జిల్లా ప్రజలకు అనువుగా పరిపాలనా సౌలభ్యం ఉన్న చోట ఏర్పాటు జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రం సెంట్రల్ పాయింట్‌గా ఏర్పాటు ఉంటుందన్నారు. కలెక్టరేట్ ఏర్పాటు రాజకీయ అంశం కాదని ప్రజల పరిపాలన సౌలభ్యం మాత్రమేనని చెప్పారు. రాజకీయాలు పంతాలు పట్టింపులకు తావు లేదని హెచ్చరించారు. అయితే ఇంత చెప్పినా కేంద్ర మంత్రి కలెక్టరేట్ ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది స్పష్టత ఇవ్వకుండా సమాధానం దాటవేశారు. దీనిపై సార్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మార్కెట్ యార్డులోని కలెక్టర్ ఏర్పాటు చేయాలి : సిపిఎం

కలెక్టరేట్ ఏర్పాటుపై సిపిఎం ఆది నుంచి ఒకే మాటపై ఉంది. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, ఎంఎల్‌ఎలు మంత్రులు సైతం కలెక్టరేట్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వకుండా దోబూచులాడుతున్నప్పటికీ సిపిఎం మాత్రం తన అభిప్రాయాన్ని బహిరంగంగా ప్రకటించింది. జిల్లా ప్రజానీకానికి సౌకర్యవంతంగా ఉండే మార్కెట్ యార్డ్‌లోనే కలెక్టరేట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తోంది. దీని సాధన కోసం పట్టణంలోని సంఘాలను, స్వచ్ఛంద సంస్థలను, వామపక్షాలను, ప్రజా సంఘాలను, మేధావులు కలుపుకొని ఇటీవల సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ భవనం నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలని, ప్రజా ప్రతినిధులను, రాజకీయ పక్షాలను కలుపుకొని ప్రజామోదయోగ్యంతో కలెక్టరేట్ నిర్మాణం ఉండాలని డిమాండ్ చేస్తోంది. తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, ఆచంట నుంచి వచ్చే ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డులోనే నిర్మించాలని డిమాండ్ చేస్తోంది.

మండల పరిషత్ మోడల్ ప్రైమరి స్కూల్ (మెయిన్)
యండగండి, ఉండి మండలం, ప॥గో॥జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
K. శ్రీలక్ష్మి ప్రధానోపాధ్యాయురాలు
P. ప్రతాప్ కుమార్ ఉపాధ్యాయులు
B. క్రాంతిరేఖ ఉపాధ్యాయురాలు
V.B.L. దేవి ఉపాధ్యాయురాలు
B. సత్తిబాబు ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
స్వర్గీయ నందమూరి తాతాజీ గారి ఉన్నతాశయాలతో స్థాపించబడిన విద్యాసంస్థ శ్రీ నందమూరి తాతాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ
సంస్కార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్
KNOWLEDGE IS POWER Bhimavaram (Reg.No :9/1999)
A School For Best Education & Good Character
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సంస్థ) బ్యాంక్ కాలనీ, భీమవరం, ఫోన్: 08816-237339
మా సంస్కార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రగతి పథంలో పయనించడానికి, చిన్నారుల విద్యాభివృద్ధికి మా స్కూలు నందు మీ చిన్నారులను చేర్పించి మాతో సహకరించ ప్రార్థన.మరిన్ని వివరములకు స్వయంగా గాని, ఫోను ద్వారా గాని యాజమాన్యంతో సంప్రదించగలరు.
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయ లోకానికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మండల పరిషత్ ప్రాథమిక మోడల్ ప్రైమరి స్కూల్ పర్రెడ్డిగూడెం
జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
K. రామకృష్ణ L.F.L H.M
G.C.N.V.S. కృష్ణారావు S.G.T
M. నరసింహారావు S.G.T
G. వెంకటరత్నం S.G.T
Y. తిరుపతమ్మ S.G.T

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాపులపేట స్కూల్
ఉండి మండలం, ప॥గో॥జిల్లా
అత్యుత్తమ సమాజ నిర్మాణం కోసం అలుపెరుగని దీక్షతో... ఉన్నత విలువలతో, అత్యుత్తమ క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
దాసరి లక్ష్మి ప్రధానోపాధ్యాయురాలు
ఎన్. డీనా ఉపాధ్యాయురాలు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ స్కూల్
చినపుల్లేరు, ఉండి మండలం, ప॥గో॥జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
D. కుమారస్వామి ప్రధానోపాధ్యాయులు
ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తల్లమ్మచెరువు
చినపుల్లేరు, ఉండి మండలం, ప॥గో॥జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయ లోకానికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
U. పద్మసుధ ప్రధానోపాధ్యాయురాలు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల
పెదపుల్లేరు, ఉండి మండలం, ప॥గో॥జిల్లా
సంపద విషయంలో తృప్తిపడటం ఉత్తమం... జ్ఞానం సరిపోతుంది అనుకోవడం అజ్ఞానం...
P.P. దినకర్ M.Sc.B.Ed ప్రధానోపాధ్యాయులు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పడవలవానిపేట
ఉండి మండలం, ప॥గో॥జిల్లా
కూనపరాజు లక్ష్మి ప్రధానోపాధ్యాయురాలు

చలో విజయవాడను విజయవంతం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆకివీడు

రోజురోజుకీ పెరిగిపోతున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల ఆరో తేదీన చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.సాయి ఫణి కుమార్ పిలుపునిచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఎస్ఎఫ్ఐ వినతి పత్రాలు, మండల కేంద్రాల వద్ద ధర్నాలు, 25వ తేదీన 1500 మంది విద్యార్థులతో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించినా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల్లో ఎటువంటి స్పందన లేదన్నారు. ఆ స్పందన కోరుకుంటూ రాష్ట్రస్థాయిలో ఈనెల 6వ తేదీ చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమం పోస్టర్ని ఫణి కుమార్, మండల కమిటీ సభ్యులు విద్యా వికాస్ డిగ్రీ కళాశాల వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో వంశీ, సాయి తేజ పాల్గొన్నారు.

ఆకివీడులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

ఉండి: ఈనెల 6వ తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు కె.రోహిత్ పిలుపునిచ్చారు. విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చేస్తున్న చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను ఉండిలోని దివ్య కళాశాలలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు కె.సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

సర్పంచి తాడిపర్తి ప్రియాంక

ప్రజాశక్తి - పెనుమంట్ర

పంచాయతీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాస రాజు గురువారం ఇక్కడ తెలిపారు. స్థానిక లూథరన్ చర్చి ఏరియాలో పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి సీసీ డ్రెయినేజీ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పనలో హైస్కూల్, చర్చి కాంపౌండ్ చుట్టూ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో లూథరన్ చర్చి ప్యారిస్ పాస్టర్ రెవరెండ్ దాసి రాజారత్నం, సిఆర్ దుండి నాగేశ్వరరావు, వార్డు సభ్యులు చలమల దుర్గ, ఉనికిలి సిఆర్ దాయం, రత్నరాజు పాల్గొన్నారు.


డ్రెయినేజీ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి ప్రియాంక

మా ఇళ్లు తొలగించొద్దు

దళితుల ఆందోళన

భీమవరం టౌన్ : భీమవరం 38వ వార్డు లంకపేటలో దళిత ఇళ్లను తొలగించొద్దంటూ ఆ ప్రాంత వాస్తవ్యులు గురువారం ఆందోళన చేపట్టారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ కోనా జోసెఫ్ మాట్లాడుతూ డ్రెయిన్‌ను అభివృద్ధి చేస్తామంటూ కుంటి సాకుతో పేదల కడుపు కొట్టవద్దని, పేదల ఇళ్లను తొలగించవద్దన్నారు. దీనిపై పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఆక్రమణలు తొలగించండి

తహశీల్దార్‌కు జెసి ఆదేశం

వీరవాసరం : వీరవాసరంలో ఆక్రమణలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తహశీల్దార్ ఎవి రామాంజనేయులను ఆదేశించారు. యూరియా కొరత నేపథ్యంలో జెసి వీరవాసరంలో పర్యటించిన సందర్భంగా ఆక్రమణ విషయం ఆయన దృష్టికి వెళ్లింది. కాలువ, చెరువు, హైస్కూల్ స్థలాలను కొంతమంది ఆక్రమించుకున్నారని ఆయనకు స్థానికులు తెలిపారు. దీంతో ఆక్రమణ విషయమై తహశీల్దార్‌తో చర్చించి ఆక్రమణ తొలగింపుకు తీసుకోవలసిన ముందస్తు చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు.

చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభ జయప్రదం చేయాలి

సంఘం జిల్లా కన్వీనర్ బూడిద జోగేశ్వరరావు

నరసాపురం: ఈనెల 8న దగ్గులూరులో జరగనున్న ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బూడిద జోగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ముద్దాల వారి వీధిలో టి.శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతపై జిఎస్‌టి వేసి చేనేతను ధ్వంసం చేస్తుందన్నారు. జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. సమావేశంలో గుడిమెట్ల సుబ్బారావు, బొప్పే శంకర్రావు, వాస రామలింగం, అక్కెం శెట్టి కోట నాగయ్య పాల్గొన్నారు.

నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలి

మంత్రులను కలిసిన అఖిలపక్ష నాయకులు

నరసాపురం : నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు అమరావతిలో జిల్లా కేంద్రాల పున:పరిశీలన కమిటీ సభ్యులను కలిశారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, బిసి.జనార్దనరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ తీర ప్రాంతమైన నరసాపురం నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేస్తూ, భీమవరంను జిల్లా కేంద్రంగా ప్రకటించారని అన్నారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ నరసాపురంను జిల్లా కేంద్రంగా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, అఖిలపక్ష నాయకులు నెక్కంటి సుబ్బారావు, పొత్తూరి రామరాజు, ఇలపకుర్తి ప్రకాష్, శిరిగినీడి రాజ్యలక్ష్మి, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కలవకొలను తాతాజీ, గునిశెట్టి శ్రీనివాస్, ఆరేటి మృత్యుంజయరావు, కూనపరెడ్డి రంగారావు పాల్గొన్నారు.

తీరిన అత్తిలి ప్రజల కోరిక

రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టుకు గ్రీన్ సిగ్నల్

వెల్లడించిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - అత్తిలి(తణుకు)

అత్తిలి రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుకుంటున్న ప్రజలకు వారి కోరిక తీరబోతోందని కేంద్ర సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పూరి-తిరుపతి రైలుతోపాటు సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టు పున:ప్రారంభం నేపథ్యంలో గురువారం అత్తిలిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడానికి తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ముందు వరుసలో ఉంటారన్నారు. ఇందుకు సంబంధించి అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టు కోరుతూ ఎన్నో పర్యాయాలు వినతి పత్రాలు అందజేశారని గుర్తు చేశారు.

15 వరకు ఫీజులు కట్టొచ్చు

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన ర్యాలీ

ఆకివీడు : సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ కు హాజరయ్యే విద్యార్థులకు ఈనెల 15వ తేదీ వరకు కోర్సుల్లో చేరేందుకు సమయం ఉందని సార్వత్రిక విద్యాపీఠం జిల్లా సమన్వయకర్త ఎన్.సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద నుండి అందరూ చదువుకోండి అనే నినాదంతో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా సార్వత్రిక విద్యాపీఠం సర్టిఫికెట్లను లెక్కిస్తారన్నారు. ప్రతి ఒక్కరు ఈ కోర్సుల్లో చేరవచ్చునని తెలిపారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ కుటుంబంలో ఒకరు అనారోగ్యంతో ఉంటే కుటుంబం మొత్తం కలత చెంది ఆందోళనతో ఉంటారని, అటువంటి వారికి భరోసాగా సిఎం చంద్రబాబు నిలిచారని, అనారోగ్యంతో చికిత్స పొందిన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక చేయూత అందిస్తున్నారని తెలిపారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. పట్టణంలోని నాలుగు కుటుంబాల వారికి రూ.2 లక్షల 50 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భీమవరం పట్టణ, వీరవాసరం, భీమవరం మండలాల అధ్యక్ష కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, కొయ్యలగడ్డ గణపతి, కోళ్ల సీతారాం, కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, టిడిపి నాయకుల పాల్గొన్నారు.

జిఎస్‌టి తొలగింపుపై బీమా ఉద్యోగుల హర్షం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జీవిత బీమా, ఆరోగ్య బీమాలపై జిఎస్‌టి పూర్తిగా తొలగిస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని జీవిత బీమా పెన్షనర్ల సంఘ నాయకులు గరికపాటి బాపయ్యశర్మ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల కనీస అవసరంగా మారిన జీవిత బీమా, ఆరోగ్య బీమాలను అభివృద్ధి చెందిన దేశాలలో సామాజిక బాధ్యతగా ప్రభుత్వాలు సహకరిస్తున్నాయన్నారు. మన దేశంలో బీమా ప్రీమియంపై జిఎస్‌టి భారంగా పరిణమించిందన్నారు. జిఎస్‌టిని తొలగించాలని బీమా ఉద్యోగులు, ఇతర సంఘాలు చేసిన దీర్ఘకాల ఉద్యమానికి ఫలితంగా ప్రీమియంపై జిఎస్‌టి తొలగింపు జరిగిందన్నారు. కోట్లాది ప్రజలు, బీమా పాలసీదారులకు వెసులుబాటు, జీవిత, ఆరోగ్య బీమా మరింత ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి, జిఎస్‌టి కౌన్సిల్‌కు, ప్రధానమంత్రికి బాపయ్యశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి

భీమవరం టౌన్ : భీమవరం పట్టణంలోని శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తగా నియమించబడిన నూతన పాలకమండలి ఛైర్మన్ గనిరెడ్డి త్రినాధ్, ధర్మకర్తలు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న పాలకవర్గం దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ దర్శనాన్ని సులభతరం చేయాలని సూచించారు.

గాడిన పడ్డ ఆడిట్ వ్యవస్థ

టిడిపి నాయకులు

పెనుమంట్ర : గ్రామపంచాయతీ ఆడిట్ వ్యవస్థను జిల్లా వ్యాప్తంగా మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ సలహాతో ప్రభుత్వం గాడిలో పెట్టిందని టిడిపి మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, కార్యదర్శి గూడూరి మురళీ మోహన్ అన్నారు. పంచాయతీలు ఆడిట్ చేయించుకున్న తరువాత ఆ రిపోర్ట్ ఎలాగుందో ప్రజలకు కాదు కదా, కనీసం వార్డ్ సభ్యులకు కూడా సమాచారం ఉండటం లేదని గమనించిన పితాని జిల్లా ఆడిట్ అధికారితో మాట్లాడారన్నారు. ఎంఎల్ఎ పితానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

మొదటి పేజీ నుంచి తరువాయి..

ఎన్నికల 'పంచాయతీ'..!

ఏర్పాటు చేసుకుని తుదిజాబితా సిద్ధం, నవంబర్ 30లోగా ఎన్నికల కసరత్తు పూర్తి చేయాలని పేర్కొంది. డిసెంబర్ చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, 2026 జనవరిలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ప్రీ ఎలక్షన్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. జిల్లా అధికారులు సైతం అందుకు సంబంధించిన కసరత్తు ప్రారంభిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు జిల్లాల విభజనకు సంబంధించి ఇబ్బంది లేకపోయినప్పటికీ పరిషత్ ఎన్నికలపై కొంత సందిగ్ధత నెలకొంది.

జులై నుంచి జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల కసరత్తు

పంచాయతీ ఎన్నికల అనంతరం వెంటనే జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను నిర్వహించాలని ప్రభుత్వం చూస్తోంది. ఎన్నికల కమిషన్ రాసిన లేఖతో ఇది స్పష్టంగా తెలుస్తోంది. 2021 మార్చిలో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎన్నికలు జరిగాయి. ఫలితాలు మాత్రం సెప్టెంబర్‌లో వచ్చాయి. తర్వాత జిల్లాల విభజన జరిగినప్పటికీ జిల్లా పరిషత్ మాత్రం ఉమ్మడిగానే కొనసాగుతోంది. జిల్లాల విభజనలో మార్పులు, చేర్పులకు సంబంధించి ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమించింది. కేంద్రం పరిధిలో ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలుగానే ఉన్నాయి. కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తేనే జిల్లా విభజన అధికారికంగా పూర్తవుతుంది. ఆ తర్వాతే జిల్లాల ఆధారంగా జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా ఇప్పట్లో పూర్తవుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 48 మండలాలు ఉండగా 48 జెడ్‌పిటిసిలు ఉన్నాయి. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో 876 ఎంపిటిసి స్థానాలు ఉన్నాయి. అధికారులు మాత్రం ప్రస్తుతం ఉమ్మడి జిల్లా ఆధారంగా జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ఏర్పాట్ల ప్రక్రియను సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కలపనున్నట్లు ప్రచారం సాగుతోంది. గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో కలపనున్నట్లు చర్చ సాగుతోంది. జిల్లాల విభజన పూర్తికాకుండా జిల్లాలవారీగా ఎన్నికల కసరత్తు సాధ్యం కాదు. 2026 జులై నాటికి జిల్లాల విభజనపై కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ వస్తుందా అనేది చూడాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికలకు మాత్రం ఇబ్బంది ఉండదు. జిల్లా పరిషత్ ఎన్నికలపై మాత్రం సర్వత్రా చర్చ సాగుతోంది.

గ్రామాల్లో నాయకుల సందడి

స్థానిక సంస్థల ఎన్నికలపై ఎన్నికల కమిషన్ లేఖ రాయడంతో గ్రామాల్లో రాజకీయ నేతల సందడి మొదలైంది. పంచాయతీ సర్పంచి పదవికి సంబంధించిన ఆశావహులు తమ మనసులోని మాటను బయటపెడుతున్నారు. పైస్థాయి నాయకులను సైతం కలిసి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరేందుకు సిద్ధమవుతున్నారు. స్థానిక నాయకులను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎంత ఖర్చవుతుంది, గెలుపోటములు ఏవిధంగా ఉంటాయనేది లెక్కలు వేస్తున్నారు. అధికార పార్టీ మద్దతుతో పోటీకి దిగితే ఇబ్బంది ఉండదనే అంచనాలు వేసుకుంటున్నారు. రానున్న రోజుల్లో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కే పరిస్థితి కనిపిస్తోంది.

పశ్చిమలో మెడికల్ కాలేజీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకొల్లు మెడికల్ కాలేజీ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పాలకొల్లు ఎంఎల్ఎ, మంత్రి నిమ్మల రామానాయుడు మెడికల్ కాలేజీ నిర్మాణంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో పాలకొల్లులో మెడికల్ కాలేజీ నిర్మాణానికి ఆమోదముద్ర పడింది. దగ్గులూరులో కేటాయించిన భూముల్లోనే మెడికల్ కాలేజీ నిర్మిస్తారా, లేక మార్పులు చేస్తారా అనేది వేచి చూడాలి.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించండి

జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరనాథ్

ప్రజాశక్తి - ఉండి

ప్రజల ఇళ్ల వద్ద నుంచి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రాలకు చేర్పించేలా చర్యలు చేపట్టాలని జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరనాథ్ పంచాయతీ అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారంలో పర్యటించిన శ్రీహరనాథ్ గ్రామంలోని బిసి కాలనీలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించే విధానాన్ని పరిశీలించి చెత్త ఏ విధంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలనే అంశాలపై ఇంటి యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఎంపిటిసి మున్నలూరి సువర్ణ లక్ష్మి శ్రీనివాస్, ఎంపిడిఒ ఎంవిఎస్ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రీసర్వే నోటీసుల పరిశీలన

ఉండి : మండలంలోని మహదేవపట్నం గ్రామంలో రీ సర్వే పూర్తి అయిన తర్వాత అభ్యంతరాలతో కూడిన నోటీసులను డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మల్లికార్జునరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లు వచ్చినవారు ఇటీవల జరిగిన గ్రామసభలో సింగిల్ ఎల్‌పిఎం నెంబర్ల కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, దీనివల్ల 9(2) నోటీసులను పరిశీలించి సింగిల్ ఎల్‌పిఎం నెంబర్లు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రత్నావళి, గ్రామపంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి చిన్నారావు పాల్గొన్నారు.

మురుగు లేని పల్లెలు కూటమి ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం : మురుగులేని పల్లెలు నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలంలో పెద్ద తాడేపల్లి, చిన్న తాడేపల్లి, వెంకట్రావు పాలెం, అప్పారావు పేట, అమృతపురం, లింగారాయుడు గూడెం, ఆరుగొలను, కుంచనపల్లి గ్రామాల్లో మురుగు నీటి సమస్య పరిష్కరించే మ్యాజిక్ డ్రెయిన్ పనులను ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధి ఘనత శ్రీరంగనాథరాజుదే..

ఆచంట : వల్లూరు సొసైటీని అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుదేనని వల్లూరు సొసైటీ మాజీ అధ్యక్షులు నారిన వీర వెంకట సత్యనారాయణ(బాబులు) అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వల్లూరు సొసైటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో స్థానిక ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ పాల్గొని వైసిపి హయాంలోని అయిదేళ్లలో ఒక్క ట్రాక్టర్ గాని, టార్పాల్ గాని ఇవ్వలేదని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. వైసిపి హయాంలో వల్లూరు సొసైటీ 2019-2024 సంవత్సరకాలంలో రూ.4 కోట్ల నుండి రూ.12 కోట్ల ఆదాయం పెంచామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. తన హయాంలో ఎంతమందికి ఎన్ని రకాలుగా ఏ పరికరాలు రైతులకు అందించమో పూర్తి సమాచారం మా దగ్గర ఉందని స్పష్టం చేశారు.

ఘనంగా గురుపూజోత్సవం

పలువురు ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - ఉండి

అన్ని వృత్తుల్లో కెల్లా అతి ముఖ్యమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఉండి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు అన్నారు. మండల కేంద్రం ఉండి మెయిన్ స్కూల్లో ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన గురుపూజోత్సవం వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన నలుగురు ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్ అవార్డు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. చిట్టూరి హెన్రీటా, పెన్మెత్స అరుణకుమారి, వర్ధనపు ప్రకాషరావు, కలిదిండి రవివర్మలను ప్రశంసా పత్రం, మెమొంటో, శాలువా, డైరీ, గొడుగు జిల్లా వారి కానుకలతో సత్కరించారు. క్లబ్ సభ్యులు కన్నెగంటి రూత్ కళ, సత్తి బ్రహ్మారెడ్డి, కాగిత మహంకాళి, బుద్ధరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

పెనుమంట్ర : గురుపూజోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ ఆధ్వర్యాన గురువారం సాయంత్రం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ(2016) అవార్డు గ్రహీత కెఎన్‌వి.శ్రీనివాస్ మండలంలోని తొమ్మిది మంది ఉత్తమ ఉపాధ్యాయులకు కడలి నరసింహా స్మారక అవార్డ్స్ ప్రధానం చేశారు. కె.కాశీ విశ్వనాథం, బి.జయశ్రీ, డి.నరసింహారావు, ఎల్.రామస్వామి, బి.కమలాకర్, జివి.ధర్మారావు, ఎస్‌వి.జగ్గారావు, ఎ.మంగామణి, సిఆర్‌పి నక్కా నరేష్‌లకు ఎంఇఒలు వై.లక్ష్మీ నారాయణ, యు.నాగేశ్వరరావు అవార్డ్స్ అందించి, మరిన్ని ఉత్తమ సేవలు విద్యా రంగానికి అందించాలని కోరారు.

ఉండిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ సభ్యులు

పెనుమంట్రలో..

మొగల్తూరులో..

యలమంచిలిలో..

మొగల్తూరు : మొగల్తూరులోని వివేకా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఎంఎస్ఆర్‌కె ప్రసాద్, సెయింట్ డైనమిక్ ప్రిన్సిపల్ మాత అంటోనీ, సెయింట్ మేరీస్ స్కూల్ ప్రిన్సిపల్ శాంత, హిందీ విశ్రాంత ఉపాధ్యాయుల కడిమి సాంబమూర్తిలను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షురాలు యు.గీత షారోన్, పుష్ప రాంబాబు, ట్రెజరర్ జి.రవిబాబు ఉన్నారు.

యలమంచిలి : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి పాలకొల్లు వారు యలమంచిలి మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పెనుమద్రులో రోటరీ నేషన్ బిల్డర్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులు ఎంవివి.సత్యవతి, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ విఎఎన్‌వి.పార్వతి, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిలను అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి పాలకొల్లు అధ్యక్షులు పులఖండం కీర్తి చంద్ రాయుడు అధ్యక్షత వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోటేటి వెంకట శేష సాయి, కోశాధికారి గవర పవన్ నాయుడు, సీనియర్ ఉపాధ్యాయులు సోమంచి శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

పెనుమంట్ర : జిల్లాలో విజిలెన్సు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా వివిధ ప్రాంతాల్లో ఏక కాలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఎరువుల షాపులను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పెనుమంట్ర మండలం ఆలమూరులో మేస్సర్స్ ధనశ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌లో తనిఖీ చేయగా మూడు షాపులలో రూ.2.35 లక్షల విలువైన 7.5 మెట్రిక్ టన్నుల ఎరువుల వ్యత్యాసం గుర్తించి, వాటిని సీజ్ చేసి షాపు యజమానుల పై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6(ఎ) కేసులు నమోదు చేసినట్టు వారు పేర్కొన్నారు. విజిలెన్సు డిఎస్‌పి సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

13న లోక్ అదాలత్

నరసాపురం : ఈనెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు సమన్యాయం అందించుటలో న్యాయవాదులు భాగస్వామ్యం కావాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి, ఛైర్ పర్సన్ ఎ.వాసంతి అన్నారు. గురువారం స్థానిక కోర్టు హాల్‌లో న్యాయవాదులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి ఎస్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

తాడేపల్లిగూడెం : శ్రామికులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు మల్లిపూడి మిత్ర పేర్కొన్నారు. స్థానిక దీక్ష డ్రగ్ డి అడిక్షన్ సెంటర్ గురువారం స్థానిక బ్రహ్మానంద రెడ్డి కూరగాయల మార్కెట్లో శ్రామికులకు మత్తు మందుల అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ పీర్ ఎడ్యుకేటర్ పి.వెంకటేష్, ఒఆర్‌డబ్ల్యు నవీన్, కౌన్సిలర్ కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకం

కొనసాగిన అంగన్వాడీల అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఉండి

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని, బాల్యవివాహాలను ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. గురువారం మండలంలోని మహదేవపట్నంలోని గాదిరాజు అప్పల నరసింహారాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

పాలకొల్లు రూరల్ : లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని పాలకొల్లు సెక్టార్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి అన్నారు. ఉల్లంపర్రు అంగన్వాడీ సెంటర్‌లో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మహిళలతోపాటు, గర్భిణులు, అంగన్వాడీ కార్యకర్తలు ఎం.భాగ్యలక్ష్మి, బి.నాగలక్ష్మి, బి.సురేఖ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌కు గుర్తించిన స్థలం పరిశీలన

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ రామల బందు గరువు ప్రాంతంలో ఉన్న స్థలాన్ని గురువారం ఆర్‌డిఒ దాసిరాజు పరిశీలించారు. గతంలో ఈ స్థలాన్ని డంపింగ్ యార్డ్‌కు వినియోగించుకునేందుకు గుర్తించారు. సమీపంలోని రైతులు అభ్యంతరం వ్యక్తం చేయటం, గుర్తించిన స్థలంలో ఉన్న రైతులు కోర్టులు ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. కోర్టులో సమస్య పరిష్కారం అవడంతో తిరిగి ఆ స్థలాన్ని డంపింగ్ యార్డ్‌గా వినియోగించుకునేందుకు అధికారులు పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజ కిషోర్ ఉన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం : విప్ నాయకర్

మొగల్తూరు : గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తుందని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండల కేంద్రం మొగల్తూరులోని రూ.3.30 కోట్లతో మొగల్తూరు నుండి చేరే పాలెం మీదుగా కొప్పర వరకు నిర్మించనున్న రహదారి పనులకు భూమి పూజ చేశారు. కోమటిప్ప, జగన్నాథపురం గ్రామాలలో రూ.9 కోట్లతో నిర్మించిన రహదారులను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సర్పంచులు పాల్గొన్నారు.

సాలిపేటలో వృద్ధులకు వస్త్ర దానం

ఉండి: వరసిద్ధి వినాయక స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, ప్రముఖ న్యూరో సర్జన్ వింజమూరి శ్రీనివాసరావు కోరారు. సాలిపేటలో శ్రీవరసిద్ధి వినాయక స్వామి 63వ వార్షికోత్సవం సందర్భంగా 63 మంది నిరుపేదలకు, వృద్ధులకు వస్త్ర దానం చేశారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నివారణ

లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ

గణపవరం : మొక్కల పెంపకం వల్ల కాలుష్యం నివారించవచ్చునని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ అన్నారు. గురువారం గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన స్థానిక మంచినీటి చెరువుగట్టు వద్ద 62 కొబ్బరి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు మాట్లాడుతూ ఇంటర్ నేషనల్ మూడవ వైస్ ప్రెసిడెంట్ ఎండార్సి వి.విజయకుమార్ రాజు 63వ పుట్టినరోజు సందర్భంగా కొబ్బరి మొక్కలు నాటడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో కోశాధికారి కె.సత్యనారాయణ మూర్తి, రావూరి నాగరాజు, సిహెచ్.రవికుమార్, వి.విశారద పాల్గొన్నారు.

వైసిపి గ్రామ అధ్యక్షులుగా సత్యనారాయణ

ఆచంట : వైసిపికి పూర్వ వైభవం తీసుకు రావడానికి కార్యకర్తలు ముందుకు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైసిపి మండల కన్వీనర్ జక్కం శెట్టి చంటి అన్నారు. వల్లూరు గ్రామంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా పెచ్చెట్టి సత్యనారాయణను నియమించినట్లు వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి రాష్ట్ర పిఎసి మెంబర్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 మందితో గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. వైసిపి సీనియర్ నేతలు కర్రి వేణుబాబు, ఏనుగుపల్లి వరప్రసాద్, కుసుమ సత్యనారాయణ, బూల ప్రసాద్, మట్టా శివన్నారాయణ పాల్గొన్నారు.

28వ వార్డులో అన్న సమారాధన

భీమవరం టౌన్ : భీమవరం 28వ వార్డు వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని గురువారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ప్రారంభించారు. నేటి యువతలో దైవ భక్తి ఎంతో పెరిగిందని, సాంప్రదాయబద్ధంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వేలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సతివాడ నవీన్ కుమార్, ఆవిడి శ్రీనివాస్, విజ్జురోతి రాఘవులు, చిన్న కర్లేపల్లి శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డులకు ఐదుగురు ఎంపిక

పెనుమంట్ర : మండలంలో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులకు జిల్లా బెస్ట్ టీచర్ అవార్డులు వచ్చాయి. ఈ మేరకు జిల్లా విద్యా శాఖ నుండి వచ్చిన సమాచారం మేరకు ఆలమూరు మోడల్ స్కూల్ నుండి యాళ్ల శోభారాణి, పొలమూరు మోడల్ స్కూల్ నుండి విఎస్ఎల్‌హెచ్.ఆచార్యులు, మాముడూరు మోడల్ స్కూల్ నుండి డిఎన్‌వి.సత్యనారాయణ, డి.నరసింహారావు, ఎస్ఐ పర్రు జెడ్‌పి హై స్కూల్ నుండి కె.ఉమా మహేశ్వరి అవార్డ్స్‌కు ఎంపిక అయ్యారు. వీరు శుక్రవారం భీమవరంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నుండి ఈ అవార్డ్స్ అందుకుంటారు.

రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆచంట : కూటమి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి రైతుల సమస్యలను గాలికి వదిలేసారని మాజీ మంత్రి, వైసిపి పిఐసి సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆరోపించారు. గురువారం తూర్పు పాలెం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎరువుల ధరలు అధికంగా అమ్ముతున్న ఇన్పుట్ సబ్సిడీ లేకపోయినా పంట నష్టపరిహారం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. బీమా సబ్సిడీ కూడా లేదన్నారు. ఆచంట నియోజకవర్గంలో నక్కల డ్రెయిన్, గోసనీ డ్రెయిన్‌లతో వందలాది ఎకరాలు ముంపు బారిన పడ్డ వారికి పరిహారం చెల్లించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. నారుమల్లు కుళ్లిపోయి రైతులపై అదనపు పెట్టుబడి భారం పడిందన్నారు. అచ్చెంనాయుడు మాట్లాడుతూ ఈనెల తొమ్మిదో తేదీన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు నిర్వహించబోయే జిల్లాల వారీగా ఆర్‌డిఒ రిప్రజెంటేషన్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తాగునీటి కోసం పంచాయతీ ముట్టడి

సిపిఎం ఆధ్వర్యాన కదంతొక్కిన చించినాడవాసులు

ప్రజాశక్తి - యలమంచిలి

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ చించినాడ మహిళలు ఖాళీ బిందెలతో గురువారం సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ సంవత్సరకాలంగా చించినాడలో పంచాయతీ ద్వారా అందిస్తున్న నీరు పసర్లతో ఉంటుందని, దీంతో ప్రజలు నీటిని కొనుగోలు చేసుకోలేక ఈ నీటినే తాగి కిడ్నీ, లివర్, చర్మ వ్యాధులు, మలేరియా డెంగీ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి చికిత్స చేయించుకుని ప్రాణాలు కాపాడుకోవాల్సి వస్తోందన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని అనేకసార్లు పంచాయతీ కార్యదర్శి మాదాసు హరిప్రసాద్‌కు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గం తమకు పట్టనట్లుగా చేతులెత్తేయడం బాధాకరమన్నారు. గతంలో సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ పాలన సాగిన కాలంలో ఎల్లవేళలా చెరువుల్లో మంచి నీటిని నింపుతూ ప్రజలందరికీ సురక్షిత నీటిని అందించే వారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజలందరికీ సురక్షిత నీరు అందించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మాదాసి హరిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు దేవ సుధాకర్, మాసవరపు సుబ్బారావు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, వార్డు సభ్యులు తెన్నేటి స్టాలిన్, మల్లుల పుల్లారావు, ఐద్వా నాయకులు సరిపల్లి జయప్రభ, బొల్లా నరసింహమూర్తి, భాస్కరరావు, కోటి కొండ, రమేష్, రాజేష్ ఉదయ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

చించినాడ పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

గురువులకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి స్పెషల్ పాఠశాలలోని చిన్నారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా సన్మానించడం అభినందనీయమని సీసలి గ్రామ సర్పంచి బి.ధనలక్ష్మి అన్నారు. గురువారం సీసలిలోని మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్‌లో పని చేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల మోడల్ ప్రాథమిక పాఠశాలగా తీర్చిదిద్దడంలోనూ పిల్లలను అన్ని రంగాల్లో ముందుకు నడిపించడంలో ఉపాధ్యాయుల కృషిని ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి ఛైర్మన్ తెనాలి అశోక్‌బాబు, గ్రామస్తులు శామ్యూల్, ధర్మరాజు, ప్రదీప్, ప్రధానోపాధ్యాయులు ఆర్.రవికుమార్, ఉపాధ్యాయులు బిఆర్ఎంకె.స్వామి, ఎన్.విజయలక్ష్మి, ఎ.విజయలక్ష్మి, సీత తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి జిల్లాస్థాయి గురు పూజోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాస్థాయి గురు పూజోత్సవ కార్యక్రమం ఈ నెల 5వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అధ్యక్షత వహిస్తారని, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఎంఎల్‌సిలు, ఎంఎల్‌ఎలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపా ధ్యాయులు, విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ముఖ్యఅతిథుల చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఆందోళన చేస్తున్న రైతు, వ్యకాస నేతలు

ఎంఎల్‌ఎ జయరాం వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి - భీమవరం

గుంతకల్లు ఎంఎల్‌ఎ గుమ్మనూరు జయరాం అనుచిత ప్రవర్తనను ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీలు తీవ్రంగా ఖండించాయి. గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డిపై ఆ సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రభాకర్‌రెడ్డిపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ సోలార్ కంపెనీలకు ఏజెంట్‌గా ఎంఎల్‌ఎ జయరాం ఉండడం సరి కాదని విమర్శించారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఓట్లు వేసిన రైతులను మరచి కంపెనీల తరఫున మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఎంఎల్‌ఎ జయరాం వెంటనే ప్రభాకర్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాళ్లబండి నారాయణమూర్తి, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వేంద్ర సత్యనారాయణ, షేక్ వలీ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు-వెంప రహదారి అభివృద్ధి చేయండి : సిపిఎం

మొగల్తూరు: మొగల్తూరు నుంచి వెంప మీదుగా భీమవరం వెళ్లే రహదారిని వెంటనే అభివృద్ధి చేయాలని కోరుతూ తహశీల్దార్ రాజకిషోర్‌కు సిపిఎం నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఈ నెల ఎనిమిదో తేదీన సోమవారం నిరసన చేపట్టనున్నామని తెలిపారు. రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి ఐదు సంవత్సరాలైనా నేటికీ పూర్తిగా కాకపోవడం దారుణం అన్నారు. సిపిఎం నాయకులు ఎడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు.



ఆక్వా యూనివర్సిటీకి సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటు

లక్ష్మణేశ్వరం తుపాన్ రక్షిత భవనం వద్ద ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

రెండేళ్ల క్రితం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆక్వా యూనివర్సిటీకి ఇప్పటి వరకు సొంత భవనాలు, క్యాంపస్ ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు విమర్శించారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆక్వా యూనివర్సిటీ విద్యార్థులకు ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న లక్ష్మణేశ్వరం తుపాన్ రక్షిత భవనం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ యూనివర్సిటీ విద్యార్థులకు తుపాన్ షెల్టర్లో తరగతులు నిర్వహించడం ఏమిటన్నారు. హాస్టల్ వసతి లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆక్వా యూనివర్సిటీ కోసం ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల స్థలంలో శాశ్వత భవనాలు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. తక్షణం భవనాల నిర్మాణం చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు, నేతలు తెలగంశెట్టి సత్యనారాయణ, గుబ్బల నాగేశ్వరరావు, బొక్కా శ్రీనివాసరావు, బాలం నాగభూషణం, కవురు లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేక అనుబంధం

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు
8 పేజీలు
శుక్రవారం
5 సెప్టెంబర్ 2025

సెప్టెంబర్ 5న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. గొప్ప ఉపాధ్యాయుడిగా ప్రసిద్ధి చెందిన ఆయన పలు విశ్వవిద్యాలయాల్లో తత్వశాస్త్ర ఆచార్యులుగా పనిచేశారు. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా వ్యవహరించారు. తరగతి గదిలో ఆయన బోధిస్తున్నప్పుడు ఆ తరగతి విద్యార్థులతోపాటు ఇతర తరగతుల విద్యార్థులు సైతం వచ్చి పాఠాలు వినేవారు. తర్వాత కాలంలో సోవియట్ యూనియన్లో భారత్ రాయబారిగా, రెండుసార్లు ఉప రాష్ట్రపతిగా, 1962-67లో రాష్ట్రపతిగా వ్యవహరించారు. ఉన్నత పదవులను అలంకరించినా ఉపాధ్యాయుడిగానే ఆయన ఎక్కువ ప్రసిద్ధి పొందారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని గురువులను గౌరవించుకుంటున్నాం. 'దేశాన్ని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని నమ్మిన ఆయన గొప్ప తత్వవేత్త. భావితరానికి పునాది వేసే భవిత శిల్పులు ఉపాధ్యాయులని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తారని నమ్మిన మహనీయుడు. వ్యక్తిత్వ వికాసంతో బాలల్లో మానవతా విలువలను పెంపొందించడంలో, వారిని భావిభారత పౌరులుగా తీర్చిదద్దడంలో కీలకంగా ఉన్న గురువులకు మన సమాజం ప్రత్యేక స్థానాన్ని కల్పించింది. విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులను వెలిగించే గురువులను సన్మానించుకోవడం మన కర్తవ్యం.

మార్గదర్శి... సర్వేపల్లి

నేడు ఉపాధ్యాయ దినోత్సవం



భావితరానికి పునాది వేసే భవిత శిల్పులు ఉపాధ్యాయులు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగడంలో కీలకపాత్ర పోషిస్తారు. ఉపాధ్యాయుల బోధనా విధానం, విద్యార్థులను మలిచేతీరు వారి భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. వ్యక్తిత్వ వికాసంతో బాలల్లో మానవతా విలువలు పెంపొందించేందుకు బోధనా విధానమే కీలకం. అందుకే భారతదేశంలో గురువును సాక్షాత్తూ దేవుళ్లతో పోల్చి పూజించారు. విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతులను వెలిగించే గురువులకు మనదేశంలో ప్రత్యేక స్థానాన్ని కల్పించారు. దానిలో భాగమే సెప్టెంబర్ 5న జరుపుకొనే ఉపాధ్యాయ దినోత్సవం

'దేశాన్ని తీర్చిదిద్దే మేధావులు ఉపాధ్యాయులే' అని నమ్మే మంచి ఉపాధ్యాయులు, గొప్ప తత్వవేత్త, రాజకీయ నాయకుడు అయిన 'భారతరత్న' సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి నేడు. ఆయన స్వతంత్ర భారతదేశానికి మొట్టమొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి. మద్రాస్ ప్రెసిడెన్సీలోని తిరుత్తణిలో సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు సెప్టెంబర్ 5, 1888న రాధాకృష్ణన్ జన్మించారు. అతిసాధారణ బ్రాహ్మణ కుటుంబం. తండ్రి ఓ జమిందారు వద్ద చిన్న ఉద్యోగం. తిరుత్తణిలోని ప్రైమరీ బోర్డు హైస్కూల్‌లో 1893లో ప్రాథమిక విద్య ప్రారంభమైంది. చదువంటే ప్రాణంగా భావించిన రాధాకృష్ణన్ ఎన్ని కష్టాలు ఎదురైనా చదువు పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించలేదు. పేద కుటుంబం కావడం వల్ల విద్యాభ్యాసం చాలావరకు ఉపకార వేతనాలపైనే కొనసాగింది. ప్రాథమిక విద్య ముగియగానే తిరుపతిలోని హెర్మన్స్‌బర్గ్ ఎవాంజెలికల్ లూథరన్ మిషన్ స్కూల్లో ఉన్నత విద్య కొనసాగింది. అనంతరం మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 21 ఏళ్ల వయస్సులోనే మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో వేదాంత శాఖలో అసిస్టెంట్ లెక్చరర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే ఆయన భారతీయ తత్వశాస్త్రాలపై ఎన్నో రచనలు చేశారు. ఆయా రచనలు ఎందరినో ప్రభావితం చేశాయి. తత్వశాస్త్రంలో ఆయన ప్రతిభను గుర్తించిన మైసూరు విశ్వవిద్యాలయం వారు తమ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా నియమించారు. విద్యార్థులు ఆయన బోధనను ఎంతో శ్రద్ధతో వినేవారట. తర్వాత రవీంద్రనాథ్ ఠాగూర్ కోరిక మేరకు కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్య పదవిని చేపట్టాలని నిశ్చయించుకొన్నారు. తమ అధ్యాపకునికి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన విద్యార్థులు రైల్వేస్టేషన్ దాకా రాధాకృష్ణన్‌ను జట్కాబండిపై ఎక్కించుకొని స్వయంగా బండిని లాక్కొని వెళ్ళిన సంఘటన ..2లో

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎఎ - కొంతేరు
యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు...
K. అప్పారావు ఉపాధ్యాయులు
K. సుభాషిణి ప్రధానోపాధ్యాయురాలు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - చించినాడ గరువు
యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...

ఎ.పి.పి. కుమార్ ప్రధానోపాధ్యాయులు
కె. సత్యనారాయణరావు ఉపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటి

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల పెనుమర్రు
యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు...

మరియు తోటి ఉపాధ్యాయులు
G.V. శేషసాయి ప్రధానోపాధ్యాయులు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆర్యపేట
యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...

మరియు పాఠశాల యాజమాన్య కమిటీ
ఎం. రాంబాబు ప్రధానోపాధ్యాయులు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ శిరగాలపల్లి
యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకొని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...

మరియు పాఠశాల యాజమాన్య కమిటీ
బి. శైలజ ప్రధానోపాధ్యాయురాలు

తెలుగు సాహిత్య ఊపిరి.. పంపన సాయిబాబు

- 40 ఏళ్ల ఉపాధ్యాయ ప్రస్థానంలో పలు అవార్డులు సొంతం
- సామాజిక సేవలోనూ ప్రత్యేక ముద్ర
- విద్యాభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్ కోసం విశేష కృషి
- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత పంపన సాయిబాబు

చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సాయిబాబు

ప్రజాశక్తి - పాలకోడేరు

తెలుగు సాహిత్యం అంటే ఆయనకు ఊపిరి. సాహిత్యాన్ని ఆస్వాదించడం, ప్రజలకు చాటి చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి. ఉపాధ్యాయునిగా పని చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న వ్యక్తి పంపన సాయిబాబు. వేంద్ర జెడ్‌పి హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న సాయిబాబుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ఆయనను పలకరించింది. పాలకోడేరు మండలం శృంగవృక్షం పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి ప్రాంతంలో 1965లో సాయిబాబు జన్మించారు. ఇక్కడే ప్రాథమిక విద్య, ఉన్నత విద్య వీరవాసరం ఎంఆర్‌కె, విఇసి జూనియర్ కళాశాలలో అభ్యసించారు. 1985లో ఉపాధ్యాయ శిక్షణ తీసుకుని ఉద్యోగం సాధించారు. మడుగుపోలవరం, కొణితివాడ, వీరవాసరం, తోకలపూడిపాలెం, తోలేరు, వెంకటాపురం, నందమూరిగరువు ప్రాథమిక పాఠశాలల్లో 27 ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. 2012లో ఉద్యోగోన్నతి సాధించి తోలేరు జెడ్‌పి హైస్కల్ తెలుగు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. 2017లో జరిగిన బదిలీల్లో ఆయన చదువుకున్న వీరవాసరం జెడ్‌పి హైస్కూల్‌కు తెలుగు ఉపాధ్యాయునిగా బదిలీపై వెళ్లారు. ఈ ఏడాది వేంద్ర జెడ్‌పి హైస్కూల్‌కు బదిలీపై వచ్చి పని చేస్తున్నారు.

ఉపాధ్యాయ జీవితంలో ఎన్నో సేవలు..

సాయిబాబు

ఉపాధ్యాయులుగా పని చేస్తూనే విద్యార్థులను బడివైపు నడిపించి హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేశారు. తోకలపూడిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న సమయంలో అప్పటి గ్రామ సర్పంచి చింతపల్లి మాణిక్యాలరావు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు 12 సెంట్లు ఆటస్థలాన్ని కొనుగోలు చేశారు. కొండలా పేరుకుపోయిన చెత్తను, బహిరంగమల విసర్జన నిర్మూలనకు ప్రజా సహకారంతో కృషి చేశారు. పాఠశాల భౌతిక వనరుల అభివృద్ధికి, పదో తరగతి విద్యార్థుల ఉన్నతికి, వీరవాసరం హైస్కూల్ పూర్వ విద్యార్థిగా 1980 బ్యాచ్ సంఘ ప్రధాన కార్యదర్శిగా పాఠశాల, విద్యార్థుల అభివృద్ధిలో

సాయిబాబును సత్కరించిన కలెక్టర్, కొత్తపల్లి

సాయిబాబు వచ్చిన మెమెంటోలు, సర్టిఫికెట్లు, మెడల్స్

భాగంగా రూ.2 లక్షలు వెచ్చించారు. అక్షరదీక్ష కార్యక్రమంలో వాలంటీర్‌గా, మాస్టర్ ట్రైనీగా, జిల్లా రిసోర్స్ పర్సన్‌గా పని చేశారు. పల్స్ పోలియోలో పని చేసి పోలియోరహిత సమాజం కోసం కృషి చేశారు. జన్మభూమి కార్యక్రమంలో కళాకారునిగా, ఫెసిలిటేటరుగా పని చేశారు.

మరెన్నో అవార్డులు, రికార్డులు

మండల ఉత్తమ ఉపాధ్యాయలుగా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయలుగా, జిల్లా ఉత్తమ యూత్ లీడర్, గురుబ్రహ్మ, నేషనల్ గ్రీన్‌కోర్, ఉగాది పురస్కారం, ఆంధ్రశ్రీ, జనచైతన్య ఉపాధ్యాయ రత్న, బెస్టు సిటిజన్, సంఘ మిత్ర, ఇండియన్ ఐకాన్, పర్యావరణ మిత్ర, గురజాడ స్మారక అవార్డు, పడాల ధర్మారావు స్మార్ట్ అవార్డు, ఎన్‌టిఆర్ ట్రస్టు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయలుగా, తెలుగు-వెలుగు ఉగాది జాతీయ పురస్కారం, జ్యోతిరావుపూలే జాతీయ ఆదర్శ ఉపాధ్యాయలుగా.. ఇలా ఎన్నో గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు అవార్డులను పొందారు.

తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర..

అంతర్జాతీయ తెలుగు సంబరాలు, ప్రపంచ తెలుగు మహాసభ, ప్రపంచ తెలుగు కవితోత్సవాల్లో పాల్గొని ప్రపంచ వేదికలపై సత్కారం పొందారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డ్స్, భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం మహోద్యమంగా సాగాలని, ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని వృద్ధి చేయాలని.. ప్రజల, విద్యార్థుల భాగస్వామ్యంతోనే అది సాధ్యమని, ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని కవితలను, గేయాలను, రాసి ప్రజల్లో, విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చారు. ఈ కృషికి ఫలితంగా నేషనల్ గ్రీన్ కోర్ అవార్డు కైవసం చేసుకున్నారు.

ప్రముఖులు, ఉపాధ్యాయుల అభినందనలు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సాయిబాబు ఎంపిక కావడంపై వేంద్ర పాఠశాల ప్రధానోపాధ్యాయులు జివివి.శ్రీనివాస్, గ్రామ సర్పంచి కడలి నాగేశ్వరి, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ పాలా వెంకటచలపతి, ఎంపిపి పాఠశాల విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ కడలి వెంకటఫణికుమారి, విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్, ఎంఎస్.శ్రీనివాస్, జె.ఏసుబాబు, వరలక్ష్మి, సిహెచ్.రాధ, రాజవర్ధని, ఎం.నాగబాబు విశ్వనాథరాజు, పి.ఫణిరాజేష్, ఇ.సునీల్, బంటుమిల్లి, నందమూరి గరువు గ్రామ పెద్దలు, ప్రముఖులు గుండా రామకృష్ణ, వీరవల్లి చంద్రశేఖర్, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జివివి.రామానుజం, ముద్రగళ్ల శ్రీనివాస్, దేవిరెడ్డి పుల్లారావు, కండిబోయిన నాగమునేశ్వరరావు అభినందనలు తెలిపారు.

యుటిఎఫ్‌లో క్రియాశీలక పాత్ర

ఉపాధ్యాయ ఉద్యమాల రథసారధి యుటిఎఫ్‌లో సాయిబాబు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. 1982లో యుటిఎఫ్‌లో సభ్యత్వం పొందిన పొందిన సాయిబాబు అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే సంఘంలో కొనసాగుతున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తూ ముందుకు సాగుతున్నారు.

మార్గదర్శి.. సర్వేపల్లి

(మొదటి పేజీ నుంచి)

విద్యార్థులకు తమ గురువు రాధాకృష్ణన్‌పై గల ప్రేమ, గౌరవాన్ని తెలియజేస్తుంది. కోల్‌కత్తా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా ఉన్నప్పుడు 'భారతీయ తత్వశాస్త్రం' అనే గ్రంథాన్ని రచించారు. ఇది అనేకమంది విదేశీ పండితుల ప్రశంసలు పొందింది. "మీరు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి డిగ్రీ తీసుకుంటే మీకు మరింత గొప్ప పేరొచ్చేది" అని ఒక మిత్రుడు అంటే, బదులుగా డాక్టర్ సర్వేపల్లి 'నేను ఆక్స్‌ఫర్డ్‌కు వెళితే అధ్యాపకుడిగానే వెళతాను, విద్యార్థిగా వెళ్లన'ని అన్నారు. అంతటి దేశభక్తి, స్వదేశీ విశ్వవిద్యాలయాల పట్ల అంత గౌరవం, ఆత్మాభిమానం. అలా అన్న ఆరేళ్ల తర్వాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆహ్వానంపై తత్వశాస్త్రంపై ఉపన్యాసాలిచ్చేందుకు వెళ్ళారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, అమెరికా దేశాలలో ఉపన్యాసాలిచ్చి మాతృదేశానికి పేరుతెచ్చారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా 1931 నుంచి 1936 వరకూ పనిచేశారు. 1939లో పండిట్ మదన్ మోహన్ మాలవ్య కోరిక మేరకు బనారస్ హిందూ యూనివర్సిటీ ఛాన్సలర్‌గా 1948 జనవరి వరకూ పనిచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి యునెస్కో ప్రతినిధిగా 1952 వరకూ పనిచేశారు. 1952లో భారతదేశ ప్రథమ ఉపరాష్ట్రపతిగా, తర్వాత దేశ రెండో రాష్ట్రపతిగా 1962 నుంచి 1967 వరకూ పనిచేసి మంచి రాజనీతిజ్ఞుడిగా పేరుపొందారు.

1962లో కొందరు మిత్రులు డాక్టర్ సర్వేపల్లి పుట్టినరోజు జరపడానికి ఆయన దగ్గరకు వచ్చిపుడు ఆయన దానిని సున్నితంగా తిరస్కరిస్తూ 'నా పుట్టిన రోజు వేరుగా జరిపే బదులు దానిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరిపితే నేను ఎంతో గర్విస్తానని' చెప్పి ఉపాధ్యాయ వృత్తిపట్ల తన ప్రేమను చాటారు. 1962 నుంచి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన సర్వేపల్లి జన్మదినాన్ని ప్రభుత్వం అధికారికంగా దేశంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 'గురుపూజోత్సవం' పేరుతో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం సంప్రదాయంగా మారింది.

భారతీయ తత్వశాస్త్రాన్ని ఆంగ్లంలో విదేశాలకు పరిచయం చేసిన గొప్పవ్యక్తి డాక్టర్ సర్వేపల్లి. పుస్తకాలు కొనే ఖర్చు భరించలేక, ఉచితంగా లభించిన పుస్తకాలకు అనువుగా డిగ్రీలో తత్వ శాస్త్రాన్ని ఎంచుకొన్న ఆయన, అందులోనే అంతర్జాతీయ ఖ్యాతి పొందే రచనలు చేయడం విశేషం. కేవలం 20 ఏళ్ల వయసులో ఎంఎ డిగ్రీ కోసం ఆయన రాసిన పరిశోధనాత్మక వ్యాసం "ది ఎథిక్స్ ఆఫ్ ద వేదాంత అండ్ ఇట్స్ మెటాఫిజికల్ ప్రిసపోజిషన్స్" పుస్తకంగా వెలువడింది. మైసూరు విశ్వవిద్యాలయంలో ఉండగా తొలిపుస్తకం 'ద ఫిలాసఫీ ఆఫ్ రవీంద్రనాథ్ ఠాగూర్' రాశారు. దేశీయ, అంతర్జాతీయ పత్రికలల్లో ఎన్నో వ్యాసాలు రాశారు. ఉపనిషత్తులు, భగవద్గీత వంటి భారతీయ వేదాంత, తత్వగ్రంథాల సారాంశాన్ని ఆంగ్లంలో పరిచయం చేస్తూ రచనలు చేశారు. ఆయన రాసిన 'ద రీజిన్ ఆఫ్ రెలీజియన్ ఇన్ కాంటెంపరరీ ఫిలాసఫీ', 'యాన్ ఐడియలిస్టిక్ వ్యూ ఆఫ్ లైఫ్', ది ఫిలాసఫీ ఆఫ్ ఉపనిషడ్స్', 'ఈస్ట్రన్ రెలీజియన్ అండ వెస్ట్రన్ థాట్స్', ' ద దమ్మపద', 'రికవరీ ఆఫ్ ఫైత్' పుస్తకాలు అంతర్జాతీయంగా పేరొందాయి.

మనదేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న'తో సహా ప్రతిష్టాత్మకమైన 'నైట్‌హుడ్', 'ఆర్డర్ ఆఫ్ మెరిట్', 'జర్మన్ పీస్‌ప్రైజ్', 'టెంపుల్‌టన్ ప్రైజ్' వంటి అవార్డులు ఎన్నో అందుకున్నారు. బహుమతిగా వచ్చే సొమ్మును సైతం విద్యావ్యాప్తికే అందించడం విశేషం. అలా ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటిలో డాక్టర్ సర్వేపల్లి పేరిట ఉపకారవేతనాన్ని ఇప్పటికీ ఇస్తున్నారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు తనకు లభించే వేతనంలో కేవలం రూ.2500 మాత్రమే తీసుకొని మిగిలిన సొమ్మును ప్రధాని విపత్తు నిధికి విరాళమిచ్చేవారు. డాక్టర్ కె.ఎం.మున్షీతో కలిసి 'భారతీయ విద్యాభవన్'ను స్థాపించారు. మానవ జీవితంలో మంచిని పెంచాలని, ఉత్తమ సమాజాన్ని రూపొందించాలని, మతాన్ని సరిగా అర్థం చేసుకోవాలని బోధించారు. మానవుల్లో మమతానురాగాలను పెంచే దిశగా ప్రపంచం కృషిచేయాలన్నారు. అహింసా విధానాన్ని అనుసరించడం ద్వారా ప్రపంచ దేశాలలో శాంతిని పెంచవచ్చునన్నారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కీర్తి వైభవాలకు మరొక తార్కాణం అనన్యసామాన్యమైనది. అనితర సాధ్యమైనది. యావత్ ప్రపంచంలో ఏ శాస్త్రజ్ఞునికీ, ఏ మహామేధావికీ, ఏ తత్వవేత్తకూ, ఏ రాజనీతిజ్ఞునికీ దక్కని అరుదైన గౌరవం సర్వేపల్లికి దక్కింది. ప్రపంచ దేశాలలో ప్రసిద్ధి చెందిన 152 విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం ఆయన ప్రజ్ఞాప్రతిభా విశేషాలకు ప్రతీకలు.

రాజ్యసభ అధ్యక్షులుగా డాక్టర్ సర్వేపల్లి సభను నిర్వహించిన తీరు రాజకీయ నాయకుల మన్ననలను పొందింది. సభామర్యాదలకు గానీ, అధ్యక్ష స్థాన గౌరవాలకు ఏమాత్రమూ భంగం వాటిల్లకుండా సభ్యుల కోపతాపాలకు, ఆవేశపూరిత ప్రవర్తనలకు అవకాశం కల్పించకుండా, హాస్యపు చెణుకులతో మృదువైన మందలింపులతో సభా కార్యక్రమాలు నిర్వహించి ఎంతోమంది 'పార్లమెంటేరియన్ల' ప్రశంసలు పొందారు. దేశాధ్యక్షునిగా తనదైన ముద్రవేశారు. అవసరమైనప్పుడు ప్రభుత్వ విధానాలను అతినిశితంగా, తీవ్రంగా విమర్శించడంలో వెనుకాడలేదు. పేరుకుపోతున్న అవినీతిని, జాతీయ వనరుల దుర్వినియోగాన్ని అభిశంసించారు. 1967 లో పదవీ విరమణచేసి శేష జీవితాన్ని మద్రాస్‌లో గడిపారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 1975 ఏప్రిల్ 17న తుదిశ్వాస విడిచారు.

విద్యా, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక క్షేత్రాలలో డాక్టర్ సర్వేపల్లి పోషించిన పాత్ర దేశనికే ఒక చుక్కాని వంటిది. మహా మనీషి, మహోన్నతుడు, మహమహోపాధ్యాయుని జన్మదినమైన సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినంగా పరిగణించడం అత్యంత సమంజసం. అదే ఆయనకు వినమ్రంగా మనం అర్పించే నివాళి.

ఉపాధ్యాయుడు సమాజాన్ని అర్థం చేసుకోవాలి..

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పినట్లు జాతిని తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులు. నేడు మారుతున్న కాలానికి అణుగుణంగా ఉపాధ్యాయలోకం సమాజాన్ని అర్థంచేసుకోవాలి. తదనుగుణంగా తను కూడా చైతన్యం పొందాలి. ఉపాధ్యాయుడంటే ఉత్త పాఠం చెప్పేవాడుకాదు. మార్పునకు అతడొక ప్రయోగశాల. సమాజ మార్పునకు ఉపాధ్యాయుడే కీలకం. అందుకే అతను వేసే ప్రతి అడుగు, ప్రతిచూపు, అతని ఆలోచనలధారలను సమాజం గమనిస్తూ ఉంటుంది. ఆచరించేందుకు ప్రయత్నం చేస్తుంది. ఆధిపత్య భావజాల సంస్కృతి హెచ్చుమీరిన ఈ రోజుల్లో నేడు ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే బడుగు బలహీన వర్గాల బాలలకు సమాజం పట్ల ఖచ్చితమైన అభిప్రాయాలు ఉండేట్లు బోధన సాగాలి. మంచి పౌరులుగా ఎదిగేందుకు మనం కృషిచేయాలి. నేటి సామాజిక పరిస్థితులను గమనించి ఉపాధ్యాయ వృత్తిని ప్రేమలో ముంచి తీయకపోతే బడులే మూసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. కేవలం ఉద్యోగవృత్తి మీదనే ప్రేమకాదు పిల్లల మీద, తరగతి గదిమీద, పాఠశాల మీద అట్టడుగున ఉన్న అణగారిన వర్గాలమీద ప్రేమ ఉండాలి. అలా లేకపోతే ఉపాధ్యాయుని ఉనికి కూడా భంగమే. బెత్తం పట్టుకోవడమంటే ఉపాధ్యాయుని అపజయానికి ప్రతీక. నేటి కాలంలో చదువుచెప్పటం అంటే ఒకపొరపైకి మరొక పొరను ఎక్కించడంలాంటిది. మన సమాజం ఆర్థిక, సామాజిక అసమానత పొరలతో నిండిఉంది. చదువుంటేనే సమాజాన్ని చైతన్యపరిచేది. మారుతున్న కాలంతోపాటు ఉపాధ్యాయుడూ మారాలి. అసలు మారుతున్నకాలాన్ని, విధానాలను అంచనా వేయలేనివాడు భూత, భవిష్యత్ కాలాన్ని ఊహించలేడు. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్య అంగడి సరుకుగా మారిన నేటి తరుణంలో విద్యావ్యవస్థలో విచ్ఛిన్నకర ధోరణులు ప్రవేశించాయి.

పాఠశాలల్లో గ్రంథాలయాలు, ఆట స్థలాలు, ప్రయోగశాలలు, తరగతి గదులు ఉంటేనే ఉపాధ్యాయడు తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలుగుతాడు. సరైన వసతులు కల్పించకుండా విద్యాప్రమాణాల పతనానికి ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరిగాదు. ఇప్పటికే దిగజారిపోయిన విద్యాప్రమాణాలపై ప్రభుత్వాలు దృష్టిపెట్టకపోతే టీచర్లను మొక్కుబడిగా సత్కరించే రోజుగానే ఉపాధ్యాయ దినోత్సవం మిగిలిపోయే ప్రమాదం ఉందని పాలకవర్గాలు గుర్తుంచుకోవాలి.

గురువు స్థానం పదిలమేనా?

ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. ఒకప్పుడు నల్లబోర్డుపై బోధన చేసే చోటనే ఇప్పుడు డిజిటల్ తెరపై పిల్లలకు సులువుగా అర్థమయ్యేలా గురువులు పాఠాలు చెబుతున్నారు. బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు మాత్రమే కాకుండా సమాజంలో మాస్టార్లు ప్రధాన భూమిక పోషించేవారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానాల్లో, సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉపాధ్యాయుల పాత్ర ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇప్పుడు సమాజంలో ఉపాధ్యాయుడి స్థానం ఏమిటి? అతడికి ఏ హోదా లభించాలి ? దేశాల మధ్య ఎంత భిన్నత్వం వున్నప్పటికీ గురువుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వాల వద్ద ఏ ఉమ్మడి ప్రణాళికలు ఉండాలి? ఏ ప్రమాణాలు పాటించాలి? ఎలాంటి విధానాలు ఉండాలి ? వీటన్నింటిపై సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కాలం ప్రవాహం లాంటిది. మానవ అవసరాలూ, సంబంధాలూ ఆ ప్రవాహంలో నిరంతరం మారుతుంటాయి. వాటికి తగ్గ విలువలూ ఏర్పడి, సమాజపు అన్నిపొరల్లోకి విస్తరిస్తూ వుంటాయి. విద్యారంగమేమీ దీనికి మినహాయింపు కాదు.

హోదాపై యునెస్కో పత్రం

వీటిపై ఐక్యరాజ్యసమితి విద్యా శాస్త్రీయ సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 1966 అక్టోబర్‌లో ఆమోదించిన పత్రం ఆనాటి కంటే ఇప్పుడు మరీ విలువైంది. యునెస్కో చాలా స్పష్టంగా గురువుల హోదా 'విద్యను పిల్లల ప్రాథమిక మానవహక్కుగా ప్రభుత్వాలు గుర్తించడంపై ఆధారపడి వుంది' అని మొదటి వాక్యంలోనే చెప్పింది .మానవాభివృద్ధి ఆధునిక సమాజంలో అన్నిటికంటే విలువైందని ప్రభుత్వాలు గుర్తిస్తే దానికి ప్రధాన సూత్రధారులైన ఉపాధ్యాయులకు న్యాయమైన హోదా సహజంగానే లభించి తీరుతుందని దాని సారాంశం. మరో మాటలో చెప్పాలంటే ప్రభుత్వం విద్యకిచ్చే ప్రాధాన్యతపై గురువుల గౌరవం ఆధారపడి వుంటుంది.

మరి ఆ విద్య ఎలాంటిదై వుండాలి?

అది మానవుడి సంపూర్ణ అభివృద్ధికి మార్గదర్శకంగా వుండాలి. దీన్ని సైతం యునెస్కో ప్రముఖంగా పేర్కొంది. అలాంటి విద్యకు పెద్ద పీట వున్నచోట గురువులు కూడా గొప్ప గురువులే అయి వుంటారు. సామాజిక చైతన్యం, నైతికత, సాంస్కృతిక వికాసం, మానవ హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సమున్నత సమాజ నిర్మాణం మన చదువులకు పరమలక్ష్యంగా వున్నప్పుడు ఉపాధ్యాయులు కూడా దీనికి తగ్గ ప్రమాణాలతోనే వుంటారు. వారి వృత్తి పట్ల ప్రజల్లో అపార గౌరవం వుంటుంది. వారి హోదాకు సమాజమే రక్షణ కవచమవుతుంది.

ఇలాంటి ఉపాధ్యాయులకు సంఘాలు పెట్టుకునే హక్కు, తమ హక్కుల్ని కాపాడుకునేందుకు ఉమ్మడి బేరసారాలు చేసే హక్కు కూడా వుండి తీరాలి. వారికి సమానమైన వేతనాలు లభించాలి. ఎలాంటి వివక్షతో వారిని చూడరాదు. ఇవన్నీ 1948– 1960 ల మధ్య అంతర్జాతీయంగా జరిగిన పలు చర్చల్లో ఆమోదించిన అంశాలు. వాటినన్నింటిని యునెస్కో తనపత్రంలో పునరుద్ఘాటించింది. విద్యావ్యాప్తిలో ముఖ్యపాత్ర పోషించే శక్తులుగా ఉపాధ్యాయ సంఘాలను గుర్తించాలని పేర్కొంది. విధాననిర్ణయాలన్నిటిలో వీటిని భాగస్వాముల్ని చేయాలని పేర్కొంది. ఈ సదస్సుకు 75 దేశాలు హాజరయ్యాయి. అందులో మన దేశమూ వుంది.

మారుతున్న ప్రపంచం..

ఇదంతా పాత సంగతి. అరవై ఏళ్ల నాటి సంగతి. ప్రపంచం ఈ తర్వాత శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో పురోగమించింది. దేశాల ఎల్లలు క్రమంగా చెరిగిపోతున్నాయి. ప్రజాస్వామిక విలువలపై ఎప్పుడూ జరగనంత చర్చ జరుగుతున్న కాలమిది. మానవ హక్కులకు ఎక్కడ భంగం కలిగినా భూగోళమంతా నిరసన ధ్వనులు వినిపిస్తున్న రోజులివి. అన్నిటికంటే మించి ఆర్థికాభివృద్ధికి మానవాభివృద్ధిని ఇరుసుగా అటు అర్థశాస్త్రవేత్తలు, ఇటు సామాజిక శాస్త్రవేత్తలు మొత్తం ముక్త కంఠంలో వర్ణిస్తున్న యుగంలో మనమున్నాం. ఆధునిక సమాజం ఇప్పుడు విద్యకిస్తున్న ప్రాధాన్యతను మనమెప్పుడూ ఎరగం. దీనితో పాటు నూతన శాస్త్రాలు, అన్వేషణలు, వాస్తవాలు, నిరూపణలు, తాత్వికతలు కూడా మన విద్యారంగాన్ని విప్లవాత్మకంగా మార్చేస్తున్నాయి. న్యాయంగా అయితే మన చదువులు వీటివల్ల ఒక మహోన్నత విశ్వమానవ సమాజానికి బాటలు వేసేవిగా రూపాంతరం చెంది వుండాలి.

మారిపోయిన విద్యా నిర్వచనం ..

కానీ నిజంగా విద్యారంగంలో జరుగుతున్నదేమిటి? దీంతో ఉపాధ్యాయుడి హోదా ఏ రూపంలోకి మారుతోంది? అన్నిటికంటే పెద్ద సమస్య ఏమంటే మన విద్యకు నిర్వచనం మారిపోయింది. బతుకుతెరువు కోసం కొన్ని నైపుణ్యాల్ని అందించడం, పోటీ పరీక్షల కోసం కొన్ని మెళకువలను నేర్పించడం, మెదడు నిండా వీలున్నంత సమాచారాన్ని దట్టించడం ప్రస్తుతం చదువుగా దఖలు పడిపోయింది. దీంతో గురువుకి కూడా పిల్లల్ని పరీక్షల్లో గట్టెక్కించడం పరామావధిగా మారిపోయింది. అతని ప్రమాణాలకు ఇదే కొలబద్ద అయిపోయింది.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఓ ఐదారు దశాబ్దాలకు ముందు "విద్య" అనగానే కొన్ని పదాలు దానికి తప్పనిసరిగా తోడుండేవి. స్వేచ్ఛ, ప్రజాస్వామిక, విమర్శనాత్మక, సృజనాత్మక, విముక్తిదాయక, మానవీయ, సజీవ లాంటి విశేషణాల నుంచి అది విడదీయలేనిదిగా వుండేది. ఎందరు విద్యాతాత్వికులు వీటి చుట్టూ ఎన్ని చర్చోపచర్చలు చేశారో, ఎన్ని ప్రయోగాలు జరిపారో, ఎంతగా జీవితాల్ని అంకితం చేశారో చెప్పలేము. వీరందరినీ మనం గొప్ప గురువులన్నాం. వారి నిర్ధారణలకు, ప్రయోగాలకు మన విద్యా విధానాల్లో, పాఠ్య ప్రణాళికల్లో గొప్ప స్థానం వుండేది. సమాజపు భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందని గొప్పగా చెప్పుకునే వాళ్ళం. దీనికి తగినట్టు గురువును సమున్నత స్థానంలో ప్రతిష్టించుకున్నాం.

బీటలు వారుతున్న స్థానం..

ప్రపంచీకరణ యుగంలో ఇవన్నీ తల్లకిందులైపోయాయి. సమాజంలో ప్రతిదీ సరుకుగా మారిపోయింది. సరుకు అనగానే మార్కెట్, వ్యాపారం ముందుకొచ్చి మిగతా విలువలన్నీ వెనక్కి పోతున్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయుడి హోదాని అది తీవ్రంగా దెబ్బతీస్తోంది. అతడికిప్పుడు తరగతి గదిలో స్వేచ్ఛ లేదు. పాఠ్యాంశాల రూపకల్పనలో స్థానం లేదు. విద్యావిధానాల్లో ప్రమేయం లేదు. అతని అనుభవాలకు ఏ విలువా లేదు. అన్నిటికంటే ఘోరం అతనికి, విద్యార్థికి మధ్య ఆత్మీయ స్పర్శ లేదు. ఒక సజీవ సంభాషణ లేదు. స్నేహమయ ప్రపంచం లేదు. దీనివల్ల విద్యార్థి ఎంత పోగొట్టుకుంటున్నాడో గురువు కూడా అంతే పోగొట్టుకుంటున్నాడు. పిల్లలెంత నిర్గుణ నిర్వికారులుగా మారుతున్నారో.. ఉపాధ్యాయులూ అలానే అవుతున్నారు. ఒక దశ దాటేప్పటికి మన గురువులు ఏదో పోగొట్టుకున్నామనీ, తమ గురువు స్థానం బీటలు వారిందని గుర్తించే స్పృహను కూడా కోల్పోతున్నారు. మౌనంగా ఒక చట్రంలోకి ఇమిడిపోతున్నారు. ఇంతకన్నా వారికి జరిగే నష్టం ఏముంటుంది?

హరించుకుపోతున్న హక్కులు..

కార్మిక చట్టాల్లో మార్పులు, ప్రజాస్వామిక ఉద్యమాల అణచివేత, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల ప్రవేశం లాంటివి ఒకదానికొకటి తోడై ఉపాధ్యాయ సంఘాలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న పెన్షన్ లాంటి హక్కులన్నీ ఒక్కొక్కటీ హరించుకుపోతున్నాయి. సంఘాలకు గుర్తింపు, గౌరవం, విధానాల్లో భాగస్వామ్యం, వాటితో నిరంతర ప్రజాస్వామ్య సంబంధాలు దాదాపు అడుగంటుతున్నాయి. ఎంతో సైద్ధాంతిక నేపథ్యం, చారిత్రక వారసత్వం, సంఘటిత శక్తి, నిర్మాణం గల సంఘాలు కూడా ఎదురీదే పరిస్థితి ఏర్పడుతోంది.

ఒంటరి వాళ్లవుతున్న టీచర్లు..

ఇవన్నీ ఒక ఎత్తు.. టీచర్లు సమాజానికి నానాటికీ దూరమైపోడం మరో ఎత్తు. మానవ సంబంధాలన్నీ తారుమారవుతున్న కాలం మనది. తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఏ స్నేహ సంబంధాలు లేని విద్యారంగం అంతిమంగా టీచర్లని కూడా ఒంటరి వాళ్లను చేస్తుంది. వారికి సమాజపు మద్దతు కరువయ్యేలా చేస్తుంది. బడి బరువంతా గురువులే మొయ్యాల్సిన స్థితి ఏర్పడుతుంది. దీంతో టీచర్లు ప్రతిదానికీ దోషులుగా నిలబడాల్సి వస్తుంది. వారి హోదా మరీ సన్నగిల్లి పోవడానికిది దారితీస్తుంది. ఇలాంటి పరిణామాల పట్ల ఉపాధ్యాయ వర్గం అప్రమత్తం కావాలి. వీటికి మూలాలు ఎక్కడున్నాయో వెతికి పట్టుకోవాలి. తమనొక్కరినే ఈ ఉపద్రవం చుట్టుముట్టడం లేదనీ, మొత్తం సమాజాన్నీ ఇది ఆవహించిందనీ అర్థం గుర్తెరగాలి.

గురువు ధర్మం గుర్తుంచుకోవాలి

ఉన్నంతలోనైనా తమ స్థానం పదిలంగా వుండాలంటే ఘర్షణ పడక తప్పదు. ఒకవైపు తన స్థాయిని, వృత్తి ప్రమాణాల్ని ఆధునిక సామాజిక అవసరాలకు తగినట్లు పెంచుకుంటూ ఎదురీడం నేర్చుకోవాలి. పిల్లల మనసుల్ని గెలుచుకొని, సమాజానికి సన్నిహితం కావాలి. సుదీర్ఘ మానవ చరిత్ర ఎన్ని మలుపులు తిరిగిందో గురువులకు మరొకరు చెప్పాల్సిన అవసరం లేదు. ఆ మలుపుల్ని ఏ శక్తులు ఎలా మలుచుకున్నాయో, అప్పుడు ఏ సవాళ్లు ఎదురయ్యాయో, ఏ ఘర్షణలు జరిగాయో, వీటిలో ఎవరు గెలిచారో, ఎవరు ఓడారో ఉపాధ్యాయులకు వివరించి చెప్పాల్సిన పనిలేదు. ఈ మలుపులన్నింటా గొప్ప గురువులు ఏ పాత్రను పోషించారో, ఎన్ని కష్టాల్ని కొనితెచ్చుకొని తమ గురు స్థానాన్ని భద్రం చేసుకున్నారో వారికి బోధించాల్సిన అవసరం అంతకన్నా లేదు.

గురువులు స్వాధ్యాయం (ప్రపంచాన్ని తెలుసుకోవడం) నుంచి దూరం కానంతకాలం, ప్రవచనం (బాధ్యతగా బోధించడం) నుంచి పలుచబడనంతకాలం వారి స్థానం పదిలంగానే వుంటుంది. కాకుంటే కాల పరీక్షకు తట్టుకోవాలి. "తాము గురువులం సుమా!" అని అనుక్షణం గుర్తుంచుకోవాలి. విశాల ప్రపంచంలోని విమోచనా శక్తులన్నిటితో మమైకం కావాలి.

చదువుల్లో అంతరాలు- గురువుల్లో అంతరాలు

మనం విశ్వగురువులమనీ, మూడవ ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నామని ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా ప్రపంచంలోని నిరక్షరాస్యుల్లో సింహభాగం మనవాళ్లే! కనీసం సగానికి సగం మందికి అక్షర జ్ఞానం అందివ్వడమే గగనంగా వున్న చదువులు మనవి. మన సామాజిక ఆర్థిక అంతరాల్నీ, అసమానతల్నీ మన విద్య మరింత స్థిరపరుస్తోంది. అందరు పిల్లలు కలిసి ఒకే చోట, ఒకే చదువు చదువుకునే కామన్ స్కూల్ అంటూ మనకు లేదు . "ఎంత ఆర్థిక స్తోమత వుంటే అంత మంచి చదువు" అనే విద్యానీతి మనది. ఈ అంతరాలు సహజంగానే ఉపాధ్యాయుల్లో కూడా ప్రతిఫలిస్తున్నాయి. ఒకటే చదువు చెబుతున్న ప్రభుత్వ, ప్రైవేటు టీచర్ల వేతనాల మధ్య పోలికే లేదు. వారిద్దరి స్వేచ్ఛా స్వాతంత్రాలు, సామాజిక హోదా ఏమాత్రం ఒకటి కావు. యునెస్కో ఏ అంతరాలు టీచర్ల మధ్య వుండరాదని అరవై ఏళ్ల ముందు చెప్పిందో అవి అప్పటికీ ఇప్పటికీ ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి తప్ప తగ్గలేదు. టీచరు మార్కెట్లోకి వచ్చి సరుకుగా నిలబడ్డాక అతన్ని బజారులో నిలబెట్టి వేలం వెయ్యడంలో వైపరీత్యం ఏముంటుంది? క్రమంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో పిల్లలు తగ్గుతున్నారు. ప్రైవేట్‌లో పెరుగుతున్నారు. ఈ మధ్య ఇది మరీ వేగం పుంజుకుంది. దీన్ని సాకుగా చూపి మొత్తం వ్యవస్థనే ప్రభుత్వాలు కుదిస్తున్నాయి. దీంతో మంచి వేతనాలు, పని సౌకర్యాలు గల ఉపాధ్యాయ వర్గం బాగా తగ్గిపోతోంది. బతకలేని బడిపంతుళ్ళు మళ్ళీ పెరిగిపోతున్నారు.

సాంకేతికత.. కొత్త ధోరణులు..

విద్యా రంగంలోకి జొరబడ్డ సాంకేతిక విప్లవం కూడా ఈ మధ్య కొత్త ధోరణులకు తెర తీస్తోంది. క్రమంగా ఇది ఉపాధ్యాయుడిని పక్కకు నెట్టి యాంత్రిక విద్యను తరగతి గదిలో ప్రతిష్టిస్తోంది. న్యాయంగా అయితే ఈ సాంకేతికత మన చదువుల్ని సరళతరం చేసి వుండాలి. ఉపాధ్యాయుడిని మరింత శక్తిమంతుడిని చేసి, పిల్లలకు సన్నిహితుడిని చేసి వుండాలి. దీనికి బదులు గురుశిష్యుల మధ్య ఇది అడ్డుగోడగా నిలబడుతోంది. కృత్రిమ మేధ కూడా తోడైతే అది మొత్తంగానే మన చదువుల్ని ఏ తీరాలకు చేరుస్తుందో చూడాల్సి వుంది. అప్పుడు గురువు స్థానం పెద్ద ప్రశ్నార్థకం అవుతుందేమోనని భయమేస్తోంది.

- విరపు బాల సుబ్రహ్మణ్యం
విద్యావేత్త, మాజీ ఎంఎల్‌సి

చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో..
భూమిని చూసి ఓర్పును నేర్చుకో..
చెట్టును చూసి ఎదుగుదల నేర్చుకో..
ఉపాధ్యాయుడిని చూసి సుగుణాలు నేర్చుకో..
- ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

ఈ ప్రపంచంలో ఎన్ని వందల వృత్తులు ఉన్నా..
వారందరినీ తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి..
అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవం..
- అబ్దుల్ కలాం

ప్రభుత్వ పాఠశాలలు.. ప్రగతికి సోపానాలు

పెనుమర్రు గ్రామంలో సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల

ప్రజాశక్తి - యలమంచిలి

గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ అందుబాటులో ఉండే ప్రభుత్వ పాఠశాలలు ప్రగతికి సోపానాలుగా నిలుస్తున్నాయి. వ్యక్తిత్వ వికాసానికి, సమాజ మార్పునకు పునాదులు వేస్తూ నేడు చక్కని సదుపాయాలతో ఆధునిక పద్ధతుల్లో పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడే నిలయాలుగా వర్ధిల్లుతున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రయివేటు విద్యాసంస్థల మాయాజాలంలో పడి అత్యధికంగా గ్రామీణ ప్రజలు తలకు మించిన అప్పులు చేసి మరీ తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చదివించేందుకు మొగ్గుచూపడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన అనుభజ్ఞులైన ఉపాధ్యాయులు పిల్లలకు ఒత్తిడి లేకుండా బోధిస్తూ.. విద్యార్థులను ఎంతగానో ప్రోత్సహిస్తుంటే దానికి

విద్యార్థుల భవితవ్యం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం అందరి బాధ్యత

భిన్నంగా ప్రయివేట్ పాఠశాలలు మాత్రం విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అత్యధిక ఫీజులు వసూలు చేస్తూ పిల్లలపై ఒత్తిడి పెంచే బట్టీ పట్టే విధంగా పిల్లలను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారనేది అందరి నోట విన్పించే మాట. ఈ పరిస్థితుల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేలా ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పలువురు విద్యావేత్తలు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలు అందించే సదుపాయాలు..

తల్లికి వందనం పథకం ప్రతి విద్యార్థికీ వర్తింపు

మనబడి మన భవిష్యత్తు పథకం ద్వారా ప్రతి పాఠశాలలో విశాలమైన తరగతి గదులు ఫ్యాన్లు, ఫర్నీచర్, ఇంగ్లీషు ల్యాబ్, మరుగుదొడ్లు, ఆట స్థలాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పూర్తిగా విద్యుద్దీకరించిన ఆర్‌సి బిల్డింగ్స్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా పథకం ద్వారా విద్యార్థులకు యూనిఫారం మూడు జతలు, స్కూలు బ్యాగ్, నోట్‌బుక్స్, టెక్స్ట్ బుక్స్ ఉచితంగా పంపిణీ

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం వారానికి ఐదు రోజులు గుడ్డు, మూడు రోజులు చిక్కి, మూడు రోజులు రాగిజావ అందజేత.

పాఠశాల గ్రంథాలయం ద్వారా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు

వార్షికోత్సవం పేరిట విద్యార్థుల మానసిక వికాసం కోసం సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ

కంప్యూటర్ విద్య ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్, వర్చువల్ క్లాస్‌రూమ్‌లో కాల్ సెంటర్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విద్యా బోధన

యలమంచిలి నెంబర్ వన్ పాఠశాల

విజ్ఞానమేళా ద్వారా ఇన్‌స్పైర్ అవార్డు.. సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా బాల మేధావులను తయారు చేసేలా కృషి.

ఆర్యపేట గ్రామంలో ఆహ్లాదకరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల

పాఠశాలలో మనసు హత్తుకునే విధంగా ఫర్నీచర్, డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు

జాతీయ ఉత్తమ టీచర్ శ్రీనివాస్ కృషి ఆదర్శనీయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

సెప్టెంబర్ నెల వస్తే సహజంగా ఉపాధ్యాయ, అధ్యాపక లోకానికి పండుగలా ఉంటుంది. ఆ నెల ఐదో తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తారు. అయితే ఈ సందర్భంగా మండలంలోని పొలమూరు గ్రామానికి చెందిన కడలి నాగ వెంకట శ్రీనివాస్ 2016లో సాధించిన జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గుర్తుకు వస్తుంది. ఆయన వినూత్న బోధనతో, బాల సాహిత్య రచనలతో, బోధనోపకరణాల తయారీతో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతులమీదుగా 2016 సెప్టెంబర్ ఐదో తేదీన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆయన ప్రస్తుతం పెనుమంట్ర మండలం ఆలమూరు స్పెషల్ మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్నారు. ఆయన తొమ్మిదేళ్లుగా జిల్లాలో అవార్డుకు అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించి, వారిని ప్రోత్సహించి, వారికి తగిన సలహాలు సహకారం అందించి వారు మండల, జిల్లా స్థాయి అవార్డులు అందుకునేలా కృషి చేస్తున్నారు. అంతేకాకుండా ఆయన తండ్రి పేరు మీద కడలి నరసింహ స్మారక మండల బెస్ట్ టీచర్ అవార్డులతో ఉపాధ్యాయులను సత్కరిస్తున్నారు. ఆయన కృషి మిగతా ఉపాధ్యాయులకు ఆదర్శం కావాలని స్థానిక ఎంఇఒలు వై.లక్ష్మీనారాయణ, యు.నాగేశ్వరరావు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న నాగవెంకటశ్రీనివాస్

గురుత్వాకర్షణ పాత్రను.. మనం మరువకూడదు.!

బడి ఈడు పిల్లల చదువుకు
శ్రీకారం చుట్టేవాడు గురువు
గుణాత్మక విద్యను బోధించి
సంస్కారానికి ప్రాకారం కట్టేవాడు
ఉత్తముడైన ఉపాధ్యాయుడు..!

పిల్లలతో నల్ల పలకల మీద
అక్షరాలను బలపంతో దిద్దించి
చిన్నారుల మనోఫలకాలలో
అజ్ఞానాన్ని తొలగించేవారు
నిజమైన ఉపాధ్యాయులు...!

నాలుగు గోడల మధ్య కూర్చొని
విద్యార్థులకు పాఠాలు బోధించి
భావి పౌరులుగా తీర్చిదిద్దేవాడు
ఎనిమిది దిక్కులలో సంచరించే
నాలుగో సింహాలుగా చేసేవాడు..!

నేటి కాలంలో గురువుల పాత్రలకు
గత కాలపు బరువు తగ్గి పోయింది
పాఠాలను బోధించే పంతులు గారికి
అదనపు బాధ్యతలను అప్పగించారు
విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేశారు..!

ఊరికి ఉపకారి ఉపాధ్యాయుడు
మంచికి మారు పేరు మాస్టారు
పలుకు బడులతో బడిపాఠాలు చెప్పి
పిల్లలను హరివిల్లులుగా తీర్చిదిద్దే
పంతులు గారి గురుత్వాకర్షణ పాత్రను
ఇలలో మనం ఎన్నడూ మరువ కూడదు...!

జి.సూర్యనారాయణ,6281725659

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - పెనుమర్రు
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఇవే ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
ఎస్. పద్మలక్ష్మి ప్రధానోపాధ్యాయురాలు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - అబ్బిరాజుపాలెం
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
ఉత్తమ సమాజ నిర్మాణం కోసం అలుపెరుగని దీక్షతో, ఉన్నత విలువలతో, అత్యుత్తమ క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
వంగా కరుణకుమార్ ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - ఆకులవానిగువ్వ, కొంతేరు
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
కె. సత్యనారాయణ ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ - బత్తులవారిపేట, కొంతేరు
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
బి. సుబ్రహ్మణేశ్వరి ప్రధానోపాధ్యాయురాలు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎస్.డబ్ల్యు) కాజ వెస్ట్
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
సమాజ నిర్మాణం కోసం అలుపెరగని దీక్షతో, ఉన్నత విలువలతో, క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ లోకానికి గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
ఎం. శరత్‌బాబు ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - కలగంపూడి
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
సంపద విషయంలో తృప్తిపడటం ఉత్తమం... జ్ఞానం సరిపోతుంది అనుకోవడం అజ్ఞానం...
ఎన్.ఆర్.కె. పరమహంస ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ మోడల్ ప్రైమరీ స్కూల్ - మేడపాడు
ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
సమాజ నిర్మాణం కోసం అలుపెరగని దీక్షతో, ఉన్నత విలువలతో, క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ లోకానికి గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
Y. పెద్దినాయుడు ప్రధానోపాధ్యాయులు
తోటి ఉపాధ్యాయులు మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గొల్లేపరచెర్వుగట్టు, యలమంచిలి
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఇవే ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
జి.వి.ఎల్. పూర్ణిమ ప్రధానోపాధ్యాయురాలు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - పోలవరం, ఏనుగువానిలంక
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
బి. మాణిక్యాలరావు ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల - మామిడితోట H/o దొడ్డిపట్ల
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయ లోకానికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
G. రామకృష్ణ పి.ఎస్. ప్రధానోపాధ్యాయులు
M. బాపిరాజు ఉపాధ్యాయులు
G. రాంబాబు ఉపాధ్యాయులు
P.L.D.గంగాభవాని ఉపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ - ఏనుగువానిలంక
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
కె. శరత్‌బాబు ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్ - పల్లిపాలెం, ఏనుగువానిలంక
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
అత్యుత్తమ సమాజ నిర్మాణం కోసం అలుపెరగని దీక్షతో.. ఉన్నత విలువలతో, అత్యుత్తమ క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
V.V.N. బుద్ధేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక స్పెషల్ పాఠశాల - ఏనుగువానిలంక
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
సమాజ నిర్మాణం కోసం అలుపెరగని దీక్షతో, ఉన్నత విలువలతో, క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ లోకానికి గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
కె. కళ్యాణి ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎపి - శిరగాలపల్లి
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
అత్యుత్తమ సమాజ నిర్మాణం కోసం అలుపెరగని దీక్షతో, ఉన్నత విలువలతో, అత్యుత్తమ క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
బి. రవిచంద్ర ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలతో...
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల - చెన్నైబిమెరక, కాజ పడమర
యలమంచిలి మండలం, ప.గో.జిల్లా
అత్యుత్తమ సమాజ నిర్మాణం కోసం అలుపెరగని దీక్షతో, ఉన్నత విలువలతో, అత్యుత్తమ క్రమశిక్షణతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ శుభాకాంక్షలు...
ఎన్. పవన్ ప్రధానోపాధ్యాయులు
మరియు పాఠశాల యాజమాన్య కమిటీ

ఎన్నో బాధ్యతలతో విద్యారంగంలోకి నూతన ఉపాధ్యాయులు

ప్రభుత్వం డీఎస్సీ 2025 పేరుతో ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, నూతన ఉపాధ్యాయులు సెప్టెంబర్‌లో ఉపాధ్యాయ వృత్తిలోకి రానున్నారు. వారికి ముందుగా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు....

దేశంలో ఉన్న అనేక వృత్తుల్లో అత్యంత పవిత్రమైన, బాధ్యతాయుతమైన వత్తిని ఎంచుకొని మీ జీవితాన్ని, అనేక మంది జీవితాలను ముందుకు తీసుకెళ్లే ఆలోచనతో మీరు ఉపాధ్యాయ వత్తిలోకి వస్తున్నందుకు మీ అందరికీ అభినందనలు. ఉపాధ్యాయ వత్తి ప్రాచీన కాలం అనేక రూపాల్లో ఉన్నా గాని , విద్యార్థి ఉపాధ్యాయుడు ప్రత్యక్ష సంబంధంతో నేర్పే విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుందని అనేక సందర్భాల్లో నిరూపించబడింది. ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరుతో ఉపాధ్యాయ వత్తిని కనుమరుగు చేసే ప్రయత్నాలు ఉన్నా గాని అవేమీ ప్రత్యామ్నాయం కాదని అనేకమంది విద్యావేత్తలు చెబుతున్న విషయాన్ని గమనించాలి. ఒకపక్క ప్రైవేట్ రంగం, ఇంకో పక్క సాంకేతికత అభివద్ధి చెందిన దశలో ఉపాధ్యాయ వత్తిలోకి వస్తున్న ఉపాధ్యాయులు అత్యంత పవిత్రమైన వత్తిని నిబద్ధతతో నిర్వహించి ఈ సమాజాన్ని ముందుకు తీసుకెళ్తారని ఆకాంక్షిస్తున్నాము. ముఖ్యంగా చెప్పే విషయం కొద్దో , గొప్పో ఆర్థికంగా స్థిరపడ్డ వారు మన ప్రభుత్వ విద్యకి దూరమైన పరిస్థితి కనపడుతుంది. మన దగ్గర మిగిలింది పేదలు, బడుగు ,బలహీన వర్గాలు దళితులు ,గిరిజనులు సంబంధించిన మరియు నిరక్ష్యరాస్యులు గా తల్లిదండ్రులు ఉన్న విద్యార్థులు మాత్రమే మన దగ్గరికి వస్తున్న పరిస్థితి ఉన్నది. అటువంటి వెనుకబడ్డ సమాజాన్ని ఇప్పుడున్న భవిష్యత్తులో వచ్చే ఉపాధ్యాయ లోకం విద్యాబుద్ధులు నేర్పి వారి కాళ్ళ మీద వారిని నిలబెట్టి ప్రయత్నం చేయాలని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని ప్రభుత్వ విద్యా రంగం కొనసాగింపు మాత్రమే అందరికీ నాణ్యమైన ఉచిత నిర్బంధ విద్య అందుతుంది. మన ముందుతరం ఆంధ్రప్రదేశ్లో స్వాతంత్రం ముందు నుండి స్వతంత్రం తర్వాత ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం అనేకమంది వారి జీవితాన్ని త్యాగం చేసి పనిచేశారు. వీరిలో చెన్నుపాటి లక్ష్మయ్య ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడుగా ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ ఉద్యమం పేర్కొన్నది. గడిచిన 80 ఏళ్ళ కాలంలో విద్యారంగం ఎక్కువగా ప్రభుత్వ రంగంలో ఉన్న పరిస్థితుల్లో ఆ రంగంలో పనిచేసే ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వాలతో రాజీలేని పోరాటాల ఫలితంగా ఈరోజు ఉన్న సమాజంలో ఉపాధ్యాయ వత్తిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గౌరవంగా బతికే పరిస్థితి తీసుకొచ్చారు. బతకలేని

బడిపంతులు అనే నానుడి పూర్వం ఉండేది బతకడం రానివారు గా మన వత్తిని భావించి సమాజంలో చిన్న చూపు ఉపాధ్యాయ వత్తిపై ఉండేది. అటువంటి వత్తి నేడు బతుకు నేర్పే ఉపాధ్యాయుడుగా అవతారం ఎత్తిన పరిస్థితి మనమంతా చూస్తున్నాము. దీనికి ప్రధానమైన కారణం బ్రిటీష్ కాలం నుండి అనేక నిర్బంధాల్ని తట్టుకొని ఒకపక్క వత్తి చేస్తూ, మరోపక్క ఉపాధ్యాయ లోకాన్ని ఐక్యం చేస్తూ ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం చేస్తూ , సంఘాలను నిర్మించి విద్యారంగాన్ని కాపాడుతూ ఉపాధ్యాయుడు యొక్క జీవితాన్ని మెరుగుపరుచుకుంటూ పాత తరం నాయకత్వం పని చేసింది. సంఘం పెట్టుకుంటే సర్టిఫికెట్లు రద్దు చేస్తాం ఉద్యోగాల నుండి తొలగిస్తాం అని అనేక బెదిరింపులు బెదిరించిన గాని కోర్టు ద్వారా సంఘ స్వాతంత్రం సాధించి ఉపాధ్యాయ సంఘమే కాకుండా అనేక వత్తుల్లో అనే సంఘాలు పెట్టుకుని సంఘ స్వతంత్రాన్ని సాధించిన ఘనత ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఉద్యమానికి ఉన్నది. చెన్నుపాటి లక్ష్మయ్య, సింగరాజు రామకష్ణ, అప్పారి వెంకటస్వామి, దాచురి రామిరెడ్డి మైనేని వెంకటరత్నం వీణా విజయరామరాజు, మాణిక్యాంబ వంటి ఉద్దండులు ఉపాధ్యాయ ఉద్యమంలో అనేక ప్రాంతాల్లో నాయకత్వం వహించి పనిచేసి, చాలీచాలని జీతాల నుంచి ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ కమిటీ వేయటం, వేతనంతో పాటు పెరిగిన ధరలు అనుగుణం వాటి మీద కరువు భత్యాలు, ఇంకా అనేక సౌకర్యాలు, మెడికల్ అలవెన్సు ,పెన్షన్, పదవీ విరమణ తర్వాత గ్రాట్యుటీ , కముటేషన్, వ్యక్తి గత సెలవులు, వైద్య సెలవులు, ఆర్జిత సెలవులు , చైల్డ్ కేర్ సెలవులు వంటి ఎన్నో సౌకర్యాలు సాధించారు. 1991 నుండి నూతన ఆర్థిక విధానాలు భారతదేశంలో పాలకవ ర్గాలు అమలు జరుపుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయ వతి కూడా ప్రైవేటీకరణ బాట పట్టింది. ప్రభుత్వం రంగంలో ఉపాధ్యాయ వత్తి లో ఉంటే ఉపాధ్యాయుడు విద్య తప్ప వేరే ఇతర పనులు లేకుండా విద్య బోధిస్తే ఫలితాలు ఎట్లా ఉంటాయో ఆంధ్రప్రదేశ్లో గురుకుల వ్యవస్థ నిరూపించబ డింది. 1980 నుండి 2000 వరకు ప్రభుత్వ విద్యా రంగంలో గురుకులాలు మంచి పాత్ర పోషించాయి. అదేవిధంగా ఉపాధ్యాయుడు బోధనకే పరిమితమైన సందర్భాల్లో అనేక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలు, పెద్ద ఎత్తున పేదలకు విద్యనందించి, చాలామంది జీవితాలను ముందుకు తీసుకెళ్లాయి . అనేక మంది పేదలను ఉన్నతి స్థితిలో ఉంచారు. ఉపాధ్యాయ వత్తి నియామకాలు ప్రైవేటీకరణ బాట పట్టిన తర్వాత ప్రభుత్వ రంగంలో అప్రెంటిస్ వ్యవస్థ, రెగ్యులర్ నియామకాల బదులు కాంట్రాక్ట్ నియామకాలు, గెస్ట్ టీచర్లు, పార్ట్ టైం టీచర్లు, గంటల బోధనతో ఉపాధ్యాయ వత్తి చేసే ఉపాధ్యాయులు ప్రవేశించడం జరిగింది. పాత పెన్షన్ విధానం పోయి నూతన పెన్షన్ విధానం అమల్లోకి వచ్చింది. మరోపక్క ప్రైవేట్ రంగంలో చిన్న స్కూల్స్, కార్పొరేట్ స్కూల్స్ లో అరకొర వేతనాలతో ఉపాధ్యాయ వతి నందించే ఉపాధ్యాయులు వచ్చారు. ప్రభుత్వ ఉపాధ్యాయ వత్తి కుదించిపోయే పరిస్థితిలో ఉపాధ్యాయ వత్తిలోకి వస్తున్న 2025 డీ.ఎస్సీ ఉపాధ్యాయులు మీరు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తారని ఆకాంక్ష. ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్లో అన్ని ప్రాంతాల్లో అన్ని మేనేజ్మెంట్ లలో ఉపాధ్యాయులను ఐక్యం చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 1974 ఆగస్టు 10న ఆవిర్భవించింది. యు టి ఎఫ్ ఆవిర్భావం నుండి నేటి వరకు ఈ 51 సంవత్సరాలు కాలంలో ఉపాధ్యాయుల ప్రయోజనాల కోసం, ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు చేస్తూ ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకు యుటిఎఫ్ కట్టుబడి ఉంది. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్ వ్యవస్థ రద్దు, ఉపాధ్యాయుడి వేతనాల్లో వ్యత్యాసాలు సరిచేయుటకు రీ గ్రూపింగ్ స్కేల్స్ ఇప్పించడం, ఉపాధ్యాయులకు పదోన్నతులు, కౌన్సిలింగ్ విధానంలో బదిలీలు, 2010 , 2015 లో మెరుగైన ఫిట్మెంట్ ఇప్పించడం వంటి అనేక ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చటంలో యుటిఎఫ్ విశేషమైన కషి చేసింది. దీనికోసం యుటిఎఫ్ ఒంటరి పోరాటం , ఐక్య పోరాటం చేసి ప్రభుత్వాల మెడలు వంచింది.. యుటిఎఫ్ వ్యవ స్థాపక ప్రధాన కార్యదర్శి శ్రీ అప్పారి వెంకట స్వామి, దాచూరి రామిరెడ్డి, మైనేని వెంకట రత్నం, నాగటి నారాయణ , నాదెండ్ల సీతా రామాచారి, ఇప్పుడున్న నాయకులు జోజయ్య , ఐ. వి, నక్కా వెంకటేశ్వర్లు, కే. ఎస్. ఎస్. ప్రసాద్ వంటి మన నాయకత్వం పోరాట ఫలితంగా ప్రాథమిక పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ కన్నా తక్కువ వేతనాలు ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల వేతనాలు సీనియర్ అసిస్టెంట్ తో సమానంగా వేతనాలు పొందుతూ సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉన్నాడు. కరోనా తర్వాత ప్రభుత్వ ఆలోచన విధానాలు మారాయి. మారిన పరిస్థితులు మరల చర్చించుకుందాం. ఇప్పుడున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాల్సిన బాధ్యత నూతన ఉపాధ్యాయులు మరియు పనిచేస్తున్న ఉపాధ్యాయుల మీద ఉంది. నిబద్ధతతో, నిజాయితీగా, సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేస్తూ తల్లిదండ్రుల నమ్మకాన్ని చూరగొని , పాఠశాలల రోలు పెంచే విధంగా కషి చేయాలని కోరుతున్నాము. మీకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అన్ని విధాల అండగా ఉంటుందని హామీ ఇస్తున్నాము. సర్వీసు విషయాలలో మా శాఖల ద్వారా గైడెన్స్ తీసుకొని పనిచేయాలని కోరుతున్నాము.

డిఎస్‌సి 2025 ఉపాధ్యాయులకు ముఖ్యమైన సూచనలు..

1) మీరు నియామకం పొందిన పోస్టులో మీ ర్యాంకు, రోస్టర్ పాయింట్ భవిష్యత్తు లో సీనియారిటీ లిస్ట్, ప్రమోషన్ లిస్ట్ తయారు నిమిత్తం గుర్తుంచుకోవాలి. ఆధారాలు భద్రపరచుకోవాలి.

2) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మీ వ్యక్తిగత ఖాతా ప్రారంభించాలి .పాన్ నెంబర్ కూడా ఉండాలి.

3) మీ అపాయింట్మెంట్ ఆర్డర్, వ్యక్తిగత గుర్తింపు కార్డు ఎస్.ఎస్.స్సి మార్కుల జాబితా జిరాక్స్ కాపీలు మీ డి .డి. ఓ ద్వారా ఆన్లైన్ లో ట్రెజరీలకు సమర్పించి ట్రెజరీ ఐడి నెంబర్, సి .ఎఫ్ ఎం. ఎస్ నంబరు, ప్రాన్ నెంబర్ పొందాలి .

4,) ప్రాన్(పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్) వచ్చిన మీదటే మీ మొదటి జీతం చెల్లిస్తారు .

5) టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ లో ఉన్న విధంగా మీ సేవా పుస్తకంలో , మరియు ట్రెజరీ ఐ.డి నందు సి .ఎఫ్ .ఎం ఎస్ నందు మీ పేరు ఉండాలి

6) టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్ లో మీ పేరు ఉన్న విధంగా మీ సేవ సేవా పుస్తకం ప్రారంభించాలి .

7)మీ సేవా పుస్తకంలో మీ వ్యక్తిగత వివరాలు, విద్యార్హతలు , నూతన చేరిక నమోదు, మీ ఆధారిత కుటుంబ సభ్యుల వివరాలు అన్ని నమోదు చేయించాలి.

8) పోలీస్ యాంటిసిడెంట్ రిపోర్టు నిమిత్తం అటెస్టేషన్ ఫార్మ్ డీఈవో గారి ద్వారా జిల్లా ఎస్పీ కి పంపాలి .

9) మూడేళ్ల సర్వీస్ పూర్తి అయిన తర్వాత సర్వీస్ క్రమబద్ధీకరణ కోసం జిల్లా విద్యా శాఖాధికారి గారికి ప్రతిపాదనలు పంపాలి.

10) మొదటి జీతం తీసుకున్న తర్వాత ఏ.పీ. జి. యల్. ఐ నెంబర్ కోసం డీ.డి. ఓ ద్వారా ప్రతిపాదనలు పంపాలి.

ఉపాధ్యాయుల గురించి గిజుబాయి..

తన జీవితమంతా పిల్లల చదువులకోసం కృషి చేసిన గిజుబాయి ఉపాధ్యాయుల గురించి చెప్పిన మాటలు....

కొట్టి దండించే టీచర్ల పట్ల పిల్లలు భయంతోనూ ద్వేషంతోనూ రగిలిపోతుంటారు. కాబట్టి టీచర్లు పిల్లలకు తమ మీద ద్వేషభావం కలుగకుండా నడుచుకోవాలి. కొందరు టీచర్లు క్రమశిక్షణ గురించి నిరంతరం పిల్లలకు నీతులు చెబుతూ బహిర్ముఖులై ఆత్మతృప్తి పొందుతూ ఉంటారు. ఇలా ఉండ కూడదు. టీచరు ఎల్లప్పుడూ అంతర్ముఖుడై ఉండాలి. ఉపాధ్యా యుడు శిక్షణా పద్ధతులు తెలుసుకొని ఉండడం మాత్రమే చాలదు అతడు పిల్లల పట్ల ప్రేమ కల్గిఉండాలి. బాలలతో కలిసి పోవాలి. పిల్లలు అభివృద్ధివైపు పరుగులు తీస్తూ ఉంటారు. కొత్త విషయాలవైపు ఆకర్షితులవుతూ ఉంటారు. టీచర్ అన్ని విషయాల పట్ల శ్రద్ధ కలిగిఉండాలి.

ఉత్తమ ఉపాధ్యాయుడు గర్విష్టిగా ఉండ కూడదు. వినయశీలిగా ఓర్పుతో స్వతంత్రుడిగా స్నేహశీలిగా శాస్త్రబద్ధుడిగా ఉండాలి.

ఉపాధ్యాయులంతా ఒక వర్గంగా సమీకృతం కావాలి. వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు, ఆశయాలు ఉండాలి. సమాజాన్ని సుసంపన్నం చేసే విద్య బాలలకు అందించే బాధ్యత ఉపాధ్యాయులందరిపైన ఉంది. ఉపాధ్యాయులంతా స్వయంగా సామాజిక బాని సత్వం నుండి, రాజకీయ బానిసత్వం నుండి విముక్తులై ఇతరులను కూడా (ప్రజలను) విముక్తులను చేయడానికి కృషి చేయాలి.

అధ్యయనం, అధ్యాపనం, ఉపాధ్యాయుల ఊపిరిగా ఉండాలి. ఉపాధ్యాయుడు చెట్లకిం దనైనా బోధన చేయవచ్చు గానీ బానిసత్వాన్ని అంగీకరించకూడదు. ఉపాధ్యాయుడు మొదట తాను సేవాభావంతో ఇతరులకు తోడ్పడాలి. అప్పుడే విద్యార్థులలో కూడా సేవా భావము పెంపొందుతుంది. సేవాభావం మనలో ఉంటే ట్యూషన్లు ఆగిపోతాయి. కులమతాల తేడా లేకుండా పిల్లలందర్నీ సమ భావంతో చూస్తాం.

ఉపాధ్యాయుడు విద్యాలయమూ ఎల్లప్పు డూ స్వతంత్రంగా ఉండాలి. సమాజానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడాల్సిన అవసరం ఉంటే అందుకు సిద్ధపడాలి.

ఉపాధ్యాయుడు నిరంతరం జ్ఞాన సముపార్జనతో మునిగిపోయి ఉండాలి. జ్ఞాన సంపదలేని ఉపాధ్యాయుడు ఉపాధ్యాయుడే గాదు. భిక్షుడు మాత్రమే. ఒక పేదవాడు మహా దాతగా నటించినట్లు అవుతుంది. సరకులేకుం డా వ్యాపారం ప్రారంభించినట్లు వుంటుంది.

ఉపాధ్యాయుడు అన్ని పనులు తాను చేసుకోవాలి. పిల్లలు తమ పని తాము చేసుకొనేటట్లు శిక్షణనివ్వాలి.

ఇవన్నీ ఉపాధ్యాయుడు గురించిన గిజుబాయి అభిప్రాయాలు.

ఎవరు ఈ గిజుబాయి..

పిల్లల కోసం, పిల్లల వికాసం కోసం తన జీవితం సర్వస్వం అంకితం చేసిన మహోన్నత వ్యక్తి గిజుబాయి. పై పై మాటలతో ఉపన్యా సాలతో గాక ఆచరణతో జీవి తాంతం పిల్లల గురించి చదువుల గురించి తపన బడ్డ యుగ పురుషుడు. పిల్లల గురించి ఇంతగా తపన బడ్డ మరో భారతీయుడు ఇప్పటికి పుట్టలేదు.

1885లో సరిగ్గా 137 సంవత్సరాల క్రిందట గుజరాత్ రాష్ట్రంలో 'చిత్తాల్' అనే చిన్న గ్రామంలో పుట్టాడు. బి.యల్ చదివి హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించాడు.

ఆయనకు ఉండే నిబద్ధత తార్కిక జ్ఞానం, పుస్తక పఠనం ఆయన్ని విద్యారంగంవైపు అడుగులు పడేటట్లు చేశాయి. ముఖ్యంగా "మాంటిస్సోరి మదర్" అనే చిన్న పుస్తకం ఆయన జీవితాన్ని మార్చివేసింది. ఈ పుస్తకం చదవడం పూర్తికాగానే ఆయనకు తన చిన్న నాటి చదువులు గుర్తుకు వచ్చాయి. ఏది ఏమైనా ఈ అశాస్త్రీయపు చదువుల నుండి పిల్లల్ని విముక్తి చేయాలను కొన్నాడు. అందుకోసం నడుం కట్టాడు. "మాంటిస్సోరి మదర్" అనే పుస్తకం తనను ఎలా మార్చిందో గిజుబాయి మాటల్లోనే విందాం.

వెలుగు నింపిన పుస్తకం..

"ఆ చిన్న పుస్తకం చదవగానే ఒక్కసారి నా బాల్యం గుర్తుకు వచ్చింది. నాబడి, నా టీచర్లు, నా చదువులు గుర్తుకు వచ్చాయి. ఆ బడి ఒక వధ్యశాలగా కన్పించింది. మనిషి కోల్పోయిందీ, కోల్పోతున్నదీ, బాల్యం చదువుల పేరుతో ఎంతగా బలి అవుతున్నదో తెలుసుకొన్నాను.

న్యాయశాస్త్ర గ్రంథాల్లో దొరకనిది. విద్యార్థి జీవితంలో నేర్చుకో లేనిదీ ఏ గ్రంథంలో కూడా లభించని ఒక సత్యం ఒక స్వాంతన, ఒక వెలుగు ఈ పుస్తకం ద్వారా దొరికాయి.

అంధుడికి అకస్మాత్తుగా కంటిచూపు లభిస్తే ఈ ప్రపంచం దేదీప్య మానంగా ఎలా అనిపిస్తుందో అలాగా అనిపించింది.

ఈ పుస్తకం చదివిన ఫలితంగా బాలల జీవితాన్ని ఉపాధ్యాయుల జీవితాన్ని మన సమాజ జీవితాన్ని ఒక ప్రత్యేక దృష్టితో అవలో కించాను. మాంటిస్సోరి పుస్తకంలోని విషయా లన్నీ నా బిడ్డ ద్వారా బాగా అర్థం చేసుకొన్నాను.

పెద్దలమైన మనం అభివృద్ధికి ఎలా దోహదం చేస్తామో ఎలా అడ్డంకులు కల్పిస్తామో వారి మెత్తటి మనస్సులను అర్థం చేసుకోలేక వారి హృదయాలను ఎలా గాయపరుస్తామో తెలుసుకొన్నాను. మన మొండి పట్టుదలచేత తర్క వితర్కాలచేత మనం ఎలా అయోమయం లో పడిపోయి ఉంటామో అర్థం చేసుకొన్నాను.

ఇది మాంటిస్సోరి పద్ధతి వల్ల నాకు లభించిన శాశ్వత జ్ఞానంగా భావిస్తున్నాను. దీన్ని నా జీవితాంతం ప్రచారం చేయడానికి ఉపయో గించుకొంటాను."

ఒక పుస్తకం తనలో ఎలాంటి మార్పు తెచ్చిందో గిజుబాయి చెప్పిన మాటలు ఇవి.

గిజుబాయి అనేక బాల మందిరాలు, విద్యాలయాలు నెల కొల్పాడు. సొంత అనుభవాలతో పిల్లల చదువుల గురించి అనేక పుస్తకాలు రచించాడు. ఆయన రాసిన పుస్తకా లు అనేక భారతీయ భాషలలోకి అనువదింప బడ్డాయి. ఆయన రాసిన "పగటి కల" లక్షలాది కాపీలు ముద్రింపబడింది. ఇది ప్రతి విద్యావేత్త, ఉపాధ్యాయుడు చదవాల్సిన పుస్తకం.

ఒక సత్యవాదిగా, సంస్కర్తగా, పిల్లల ప్రేమికుడిగా గిజుబాయి ఉపాధ్యా యులందరికీ మార్గదర్శి.

ఆయన స్ఫూర్తితో మనం ఒక్కమంచి పుస్తకమైనా చదువుదాం. పుస్తకం చదవకపోవడం కంటే దారిద్ర్యం ఏముంది?

తల వంచే తరం కాదు.. తల ఎత్తే తరం కావాలి

‘పిల్లలకు తల వంచే శిక్షణ కంటే, నిలబడి మాట్లాడే శక్తి కావాలి. పాఠశాలలు పిల్లల చేత పాదపూజలు చేయించే కార్యక్రమాలను నిలిపివేయాలి. తల్లిదండ్రులపై ప్రేమను వ్యక్తీకరించాలంటే-మాటల్లో, చేతల్లో, మనసులో చూపాలి-తల వంచే శరీర చర్యల ద్వారా కాదు’.

ఇటీవల ఒక పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌కు హాజరయ్యాను. విద్యా ప్రమాణాలను మెరుగు పరచడానికి, తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచడానికి ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పిల్లల వ్యక్తిత్వ వికాసంపై చర్చించగలగడం అభినందనీయం. కానీ అదే వేదికపై చోటు చేసుకున్న ఒక ప్రక్రియ నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది.

పిల్లలను తల్లిదండ్రుల పాదాలకు మొక్కించటం, పాదాలు ముద్దాడమని చెప్పటం కనిపించింది. అది స్వచ్ఛందంగా జరగలేదు. అది ఆ చిన్నారుల మొహాలలో స్పష్టంగా కనిపించింది. దక్షిణ భారత సంస్కృతిలో ఇది అనూహ్యం. బెంగాల్ వంటి ఉత్తర భారత ప్రాంతాల్లో కొన్ని కుటుంబాలలో ఉండే సంప్రదాయాన్ని, మన సమాజంలో బలవంతంగా ప్రవేశపెట్టడమా? అనిపించింది. అంతే కాదు, ఉపాధ్యాయులకు పాదాభివందనం చేయించడాన్ని కూడా చూశాను. ఇవన్నీ కలిపి చూస్తే, విద్యా వ్యవస్థను అర్థం చేసుకునే మార్గాన్ని, దాని లక్ష్యాన్ని తిరస్కరించే సంకేతంగా అనిపించింది. ఇది మన పిల్లలపై విధేయతను రుద్దే ప్రయత్నంగా పురాతన సంస్కృతికే తిరిగిపోతున్న సంకేతంగా అనిపించింది.

గౌరవం అనేది ఒక భావం..

గౌరవం అనేది హృదయంలోని భావం. కేవలం శారీరక చర్యలలో లేదా బాహ్య ఉపచారాలలో ఉండదు. ఒక విద్యార్థి తన గురువును లేదా తల్లిదండ్రులను గౌరవించడానికి పాదాభివందనం చేయవలసిన అవసరం లేదు. గౌరవం అనేది వారి సలహాలను ఆదరించడం, వారి నుండి నేర్చుకోవడం, వారి బోధనలను జీవితంలో ఆచరించడం ద్వారా వ్యక్తమవుతుంది. ఆధునిక సమాజంలో, గౌరవం బాహ్య చర్యలకు పరిమితం కాకుండా, ఆలోచనలు, చర్యలు, సమానత్వ భావనల ద్వారా వ్యక్తమవ్వాలి.

సమ న్యాయానికి నిలబడే పౌరులే అవసరం

ఆధునిక విద్యా వ్యవస్థ లక్ష్యం కేవలం అక్షరాస్యతను అందించడం మాత్రమే కాదు, సమాజంలో న్యాయం, సమానత్వం, పురోగతిని సాధించగల పౌరులను తయారు చేయడం. నిలబడి మాట్లాడే విద్యార్థులు అన్యాయాన్ని ఎదిరించగలరు. సామాజిక సమస్యలపై తమ గొంతును వినిపించగలరు. సమాజంలో సానుకూల మార్పులను తీసుకురాగలరు. సామాజిక సంస్కర్తలైన రాజా రామ్మోహన్ రాయ్, జ్యోతిబా పూలే వంటి వారు అంధ విధేయతకు లొంగకుండా, సమాజంలో మార్పు తీసుకువచ్చారు.

పిల్లల అభివృద్ధికి స్వేచ్ఛ, సంభాషణ ముఖ్యం..

పిల్లల మానసిక, బౌద్ధిక అభివృద్ధికి స్వేచ్ఛ, సంభాషణ అత్యంత కీలకం. విద్యార్థులు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరచడం, ప్రశ్నలు అడగడం, చర్చలలో పాల్గొనడం ద్వారా వారి వ్యక్తిత్వం బలపడుతుంది. గురువులు, తల్లిదండ్రులు విద్యార్థులతో సంభాషణను ప్రోత్సహించాలి, వారి ఆలోచనలను గౌరవించాలి. ఇది విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుంది.

పాదపూజలు భయం ఆధారంగా ఏర్పడతాయి..

పాద పూజలు, తల వంచడం వంటి ఆచారాలు కొన్ని సందర్భాలలో భయం లేదా సామాజిక ఒత్తిడి ఆధారంగా జరుగుతాయి. పిల్లలు తాము తక్కువవారు, పెద్దవారు అత్యంత శక్తివంతులు అనే భావన పెరుగుతుంది. ఇది వారి అభివృద్ధికి ఆటంకంగా మారుతుంది. భయం ఆధారిత సంబంధం తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ ప్రేమకు ప్రతిరూపాలుగా కాకుండా, శాసించే అధికారులుగా కనిపించటం ప్రారంభమవుతుంది. విమర్శనాత్మక ఆలోచనకు అడ్డుపడటం వల్ల పిల్లలు ఏ విషయాన్నైనా ప్రశ్నించే ధైర్యం కోల్పోతారు. “పెద్దవారు చెప్పిందే నిజం” అనే అభిప్రాయం అలవాటవుతుంది. ఇవి నిజమైన గౌరవం లేదా ప్రేమను సూచించక పోవచ్చు. నిజమైన గౌరవం అనేది పరస్పర అవగాహన, ప్రేమ, ఆదరణ ద్వారా వ్యక్తమవుతుంది. విద్యార్థులు భయం కారణంగా కాకుండా, ప్రేమ - గౌరవ భావనతో తమ గురువులను, తల్లిదండ్రులను ఆదరించాలి. ఈ విధమైన గౌరవం వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయదు, బదులుగా వారిని బలోపేతం చేస్తుంది.

సంప్రదాయాలపై ఆధారపడి అధిపత్యాన్ని కొనసాగించాలనే యత్నం ఇప్పటి రాజకీయ వర్గాల్లో పాత విలువలు, గురుకుల పద్ధతులు, ధార్మిక విశ్వాసాలు అనే పేర్లతో ఆధిపత్య నిర్మాణాలను తిరిగి బలపరచే ప్రయత్నం జరుగుతోంది. ఇది కేవలం సంస్కృతి పరిరక్షణ కాదు, అధికారాన్ని నిలబెట్టుకోవాలనే ప్రయత్నం. ప్రశ్నించే పిల్లలు బదులుగా విధేయత చూపే తరం కావాలన్న లక్ష్యం ప్రస్తుతం విద్యా విధానంలో పిల్లలు నిశ్శబ్దంగా ఉండాలని, ఉపాధ్యాయుడి మాటే శాసనంగా తీసుకోవాలని సూచించే మార్గాలు పెరిగాయి. ఇది కొత్త తరం ప్రజల్లో విమర్శనాత్మక ఆలోచనను అణిచివేస్తుంది. అలాంటి తరం ప్రభుత్వాన్ని ప్రశ్నించదు, సమాజపు తేడాలను ఎత్తి చూపదు, నియంత్రణను అంగీకరిస్తుంది. ఇది ఒక విధమైన సామాజిక మౌనాన్ని బలపరచే విధానం. భారతదేశంలో పాలక వర్గాలు, రాజకీయ శక్తులు “సంస్కృతి” అనే పదాన్ని బలంగా వాడుతున్నాయి. ఇది నిజంగా ప్రజల జీవన విధానాన్ని పరిరక్షించాలన్న ఉద్దేశంతో కాకుండా, ప్రాచీన సంప్రదాయాల పేరుతో కుల ఆధారిత, అధికార వర్గాలకు అనుకూలమైన విలువలను తిరిగి తీసుకురావాలన్న ప్రయత్నంగా మారుతోంది. నూతన జాతీయ విద్యా విధానంలో ‘గురుకుల పద్ధతి’కి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రాచీన సంస్కృత గ్రంథాలపై దృష్టి పెట్టి భారతీయతను నినాదంగా మార్చడం చూస్తుంటే...జ్ఞానం పెద్దవారి వద్ద ఉండాలి, పిల్లలు వినాలనే పద్ధతికి దారితీసేలా వుంది. ఇది సమానత్వాన్ని అంగీకరించని బ్యాంకింగ్ మోడల్ విద్యను ప్రోత్సహిస్తుంది.

ఈ చర్యల వెనక దాగిన భావజాలాన్ని ప్రశ్నించాలి..

ఈ విధమైన చర్యలు “సంస్కృతి”, “గౌరవం”, “ధర్మం” అనే పేర్లతో సమాజంలో అమలవుతున్నప్పటికీ, దీని వెనుక ఉన్న అసలైన ఉద్దేశం ఏమిటి? అధికారాన్ని, అధిపత్యాన్ని కొనసాగించాలనే ప్రయత్నమా? పిల్లల ఆలోచనా స్వేచ్ఛపై పట్టు సాధించాలన్న లక్ష్యమా? సమానత్వాన్ని భయపెట్టే తత్వాలతో తుడిచేయాలన్న సంకల్పమా? ఈ ప్రశ్నలు సమాజం మొత్తం చర్చించాల్సినవి. ‘పిల్లలకు తల వంచే శిక్షణ కంటే, నిలబడి మాట్లాడే శక్తి కావాలి. పాఠశాలలు పిల్లల చేత పాదపూజలు చేయించే కార్యక్రమాలను నిలిపివేయాలి. తల్లిదండ్రులపై ప్రేమను వ్యక్తీకరించాలంటే-మాటల్లో, చేతల్లో, మనసులో చూపాలి-తల వంచే శరీర చర్యల ద్వారా కాదు’ అనే సందేశంతో కేరళ బాలసంఘం ఇచ్చిన పిలుపు ఆచరణీయమైనది.

విద్యార్థులు తల వంచే బదులు, నిలబడి మాట్లాడే శక్తిని పొందాలి. విద్య విమర్శనాత్మక ఆలోచనను, స్వతంత్ర దృక్పథాన్ని ప్రోత్సహించాలి. సంప్రదాయ గౌరవ వ్యక్తీకరణలు ఆధునిక సమాజంలో భావాధారితంగా, పరస్పర గౌరవంతో కూడినవిగా పరిణమించాలి. విద్యార్థులలో స్వేచ్ఛ, సంభాషణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ద్వారా, సమ సమాజాన్ని, పురోగమన దేశాన్ని నిర్మించగలం. తలెత్తి నడిచే విద్యార్థులు సమాజంలో సానుకూల మార్పులను తీసుకురాగల నాయకులుగా మారతారు. మన పిల్లల తలలు వంగేలా కాకుండా, గొంతుకలు ఎదిగేలా, చేతులు నిర్మించేలా, మనస్సులు ఆలోచించేలా మనం మారాలి. అప్పుడే మన విద్యా వ్యవస్థకి, మన దేశ భవిష్యత్తుకు నిజమైన గౌరవం లభిస్తుంది.

డా॥ కె.రమాప్రభ
సామాజిక కార్యకర్త

ఉత్తమ ఉపాధ్యాయిని సావిత్రీ బాయి

అది 1851వ సంవత్సరం. ఆరోజున పూనేలో బాలికల కోసం- కులాల ప్రసక్తిలేని ఓ పాఠశాల ప్రారంభమవుతోంది. తలపై ముసుగు ధరించిన ఓ యువతి ఆ బడిలో పాఠాలు చెప్పటానికి వడివడిగా నడిచివెళ్తోంది. ఆమెను చూసిన ఓ బ్రాహ్మణ స్త్రీ ఆగ్రహంతో ‘ఏం చెయ్యబోతోందీవిడ! అసలిదేం పని? మన మతానికీ , ఆడజాతికి కూడా కళంకం తెచ్చేపని’ !అంటూ కేకలు పెట్టింది.

ఆమెతో ఉన్నవాళ్లందరూ ఆ యువతిమీద పేడ ముద్దలు విసిరారు. ఆ యువతి – జ్యోతిబా భార్య సావిత్రీ బాయి – నిర్భయంగా అలాగే నడిచి వెళ్లింది. ఆమె ముందు మహోన్నతమైన ఓ లక్ష్యమున్నది. శతాబ్దాలుగా అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న బాలికలకు –ముఖ్యంగా కిందికులాల బాలికలకు విజ్ఞానాన్ని పంచడమే ఆమె లక్ష్యం. భర్త ఇచ్చిన ప్రోత్సాహంతో ఆమె విద్యావంతురాలైంది. తన భార్య విద్యావంతురాలయ్యాక కేవలం తమ కుటుంబానికే ఆమె జ్ఞానం పరిమితం కారాదనీ, ప్రజలందరికీ విద్యనందించగల వ్యక్తిగా ఆమె రూపొందాలనీ ఆయన ఆశించాడు. ఆ ఆశను నెరవేర్చటమే ఇప్పుడామెముందున్న కర్తవ్యం. తన లక్ష్యసాధన కోసం ఎన్ని ఇబ్బందులనైనా ఎదిరించటానికి ఆమె సిద్ధంగా ఉంది. ఛాందసవాదుల దూషణలనూ, వేధింపులనూ నిర్భయంగా ఎదుర్కోవటానికి నిశ్చయించుకుంది.

సంఘటన బాగా ప్రాచుర్యం పొందింది. జనం దీన్ని రకరకాలుగా వర్ణించి చెప్పుకున్నారు. కొందరు మగవాళ్లు ఆమె వెంటబడి వేధిస్తూ రాళ్లతో కొట్టేవారు. ఈ ఇబ్బందిని చూసి ఆమె భర్త జ్యోతిరావు ఓ సలహా చెప్పాడు. బడికి వెళ్లేటప్పుడు పాత చీర కట్టుకుని వెళ్లి దుమ్మూ, మురికీ పడిన చీరను పాఠశాలలో మార్చుకుని మరోకటి కట్టుకుంటుండమనీ, మళ్లీ ఇంటికొచ్చేటప్పుడు అదే పాత చీర ధరించి రావచ్చనీ చెప్పాడాయన.

పశ్చిమ మహారాష్ట్రలోని నయ్‌గావ్ గ్రామంలోని ఓ రైతు కుటుంబంలో 1831లో జన్మించింది సావిత్రీ బాయి. ఆనాటి సంప్రదాయాల ప్రకారం తొమ్మిదో ఏటనే ఆమెకు జ్యోతిరావుతో వివాహమైంది. ఆనాటి నుండి జీవితాంతం వరకూ ఆమె ఆయనకు తోడునీడగా సాహచర్యం చేసింది. ఆయన ప్రోత్సాహంతోనే ఆమె విద్యావంతురాలైంది. ఆయన కుటుంబ సభ్యులు ఇందుకు అభ్యంతరం చెప్పడంతో ఆ భార్యా భర్త లిద్దరూ వేరుగా కాపురం పెట్టాల్సివచ్చింది. జ్యోతిరావు రచించిన మంగళాష్టకం అనే పెళ్లిపాట ఆమెను ఎంతగానో ఆకట్టుకుని ఉత్తేజపరిచింది. ఆపాట ఇలా సాగుతుంది.

వరుడు : భగవంతుని ఆనతి మేరకు ఇల్లు చక్కదిద్దుకో
అన్నిటికన్నా ఉన్నతమైనది ప్రజలందరి సత్యమేనని
తెలుసుకో
నీ విద్యా విజ్ఞానాలను ప్రజలందరితో పంచుకో
ప్రేమతో నిను పెళ్లాడుతున్నా, ప్రతి అడుగున నీ తోడై
ఉంటా
శుభమంగళ సావధానం

వధువు : నువ్వెంత మంచిదానవైనా, నన్నెంత గౌరవిస్తున్నా
స్త్రీ జాతినంతా బానిసలేనను వేదన నన్ను వదలకున్నది
స్వేచ్ఛా, సమతా, ఆత్మగౌరవం పొందాలన్నది మా తపన
మా హక్కులకండగ నిలబడతానని ప్రతిన బూనగలవా?

శుభమంగళ సావధానం

వరుడు : కులాల హద్దులు చెరిపేస్తూ
స్త్రీలందరి హక్కులకై నే పోరు సల్పుతా
మహిళందరూ నా అక్కచెల్లెళ్లు
నా హృదయం నీకే అంకితం ప్రియా,
నా బాధ్యత మరువను ఎన్నటికీ
శుభమంగళ సావధానం

పెద్దల ఆశీర్వాదాలు :
తల్లిదండ్రుల గౌరవంతో
మిత్రులందరికి ప్రేమాస్పదులై
వృద్ధుల, పిల్లల, అనాధలందరి
అండదండగా నిలవండి
జ్ఞానామృతమును పంచండి
ఆనందంగా పూలబాటలో చేతులు కలిపి సాగండి
శుభమంగళ సావధానం

ఈపాటలో లాగానే సావిత్రీ బాయి జ్యోతిరావుతో కలిసి విద్యా వ్యాప్తికోసం ఉద్యమించింది. 1849లో ఆయన స్థాపించిన ఐదు పాఠశాలల నిర్వహణలో భాగం పంచుకున్నది. బాలికల పాఠశాలను ప్రారంభించాలని తలపెట్టినపుడు అందులో ఉపాధ్యాయునిగా పనిచేసే అర్హత కోసం ఫాతిమాషేక్ అనే ఓ ముస్లిం యువతితో కలిసి ఉపాధ్యాయ శిక్షణ పొందింది సావిత్రి. ఆ బడిలో ఎన్నో కులాల బాలికలు కలిసి చదువుకున్నారు. వాళ్లలో ఒక దళిత బాలిక (మాతంగ కులానికి చెందినది) రాసిన ఒక వ్యాసం ఎంతో ప్రసిద్ధి పొందింది. చదువు ప్రాముఖ్యతను గురించి తనకు కలిగిన అవగాహనను ఆ బాలిక ఇలా రాసింది:

“సజీవంగా సమాధుల్లో మగ్గుతున్న వాళ్లం మేము. అక్షరం మాకు నిషిద్ధం. భగవంతుడు మా మొరనాలకించి బ్రిటీష్ వారిని పాలకులుగా పంపాడు. ఇప్పుడు మమ్మల్నెవరూ సాధించి, బాధించలేరు. ఉరితీసి చంపటానికీ, ప్రాణాలతో పాతిపెట్టడానికి సాహసించరు. మాముందు తరాలక్కూడా భవిష్యత్తుపై భరోసా ఉన్న దిప్పుడు. మేమిప్పుడు ఒంటినిండా బట్ట కట్టగలుగుతున్నాం. స్వేచ్ఛగా అర్థవంతంగా జీవిస్తున్నాం. ఆంక్షలూ తొలగిపోయి బజారులు, ఉద్యానవనాలు మాకు తలుపులు తెరిచాయి.”

సావిత్రీబాయి, జ్యోతిరావులు విద్యారంగాభివృద్ధికి చేసిన కృషిని గుర్తించిన ప్రభుత్వం 1852లో వాళ్లిద్దరినీ సన్మానించింది. సావిత్రీబాయి ఎంతో ధైర్యసాహసాలతో సామాజిక విప్లవోద్యమాలలో పాల్గొన్నది. అంటరాని తనానికి వ్యతిరేకంగా 1868లో ఉద్యమం నడిపింది. భర్త మరణానంతరం సత్యశోధక సమాజానికి అధ్యాపకురాలిగా ఎంతో సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించింది. అనాథ స్త్రీలు, శిశువులకు సంరక్షణ కోసం శరణాలయాన్ని స్థాపించి నిర్వహించింది. ఓ బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన పిల్లవాడిని దత్తపుత్రుడుగా స్వీకరించింది. ఆ పిల్లాడిని యశ్వంత్ అనే పేరుతో పెంచి పెద్దచేసి కన్న బిడ్డ కన్నా మిన్నగా ప్రేమించింది. సామాజిక సేవలో పాల్గొంటూనే అంతిమశ్వాస విడిచింది సావిత్రీ బాయి. 1890లలో ప్లేగు వ్యాధి బారిన పడిన పిల్లల కోసం ఆమె వైద్య శిబిరాలను నిర్వహించింది. అంత దుర్భరమైన పరిస్థితుల్లో కూడా రోజుకు రెండు వేల మంది పిల్లలకు ఆమె భోజన వసతులను సమకూర్చిందట. చివరికి 1897, మార్చి 10వ తేదీన వ్యాధిసోకిన ఓ పిల్లాడికి సేవ చేస్తుండగా ఆమెక్కూడా వ్యాధిసోకి మరణించటం అతి విషాదకర సంఘటన. ప్రజలు ఆమెను క్రాంతి జ్యోతి- సావిత్రీ బాయి అని పిలుచుకుంటున్నారంటే, ఆ పిలుపులో ఏ మాత్రమూ అతిశయోక్తి లేదు.

జాతీయ విద్యా విధానం - సమస్యలు, ప్రత్యామ్నాయాలు

నూతన విద్యా విధానం- 2020 విద్యా వ్యాపారానికి అనుమతిస్తుంది. ఈ విధానం విద్యా వ్యాపారం రద్దు కోసం ఎటువంటి ప్రతిపాదనా చేయలేదు. ఆపైన ప్రభుత్వ విధులను ప్రైవేటు యాజమాన్యాలకు ధారాదత్తం చేసే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం విధానాలను విస్తరించాలని ప్రతిపాదిస్తుంది. కార్పొరేట్ పెట్టుబడులను, విదేశీ పెట్టుబడులను విద్యారంగంలోకి ఆకర్షించాలని, విశ్వవిద్యాలయాలు తమ నిధులను తామే సమకూర్చుకోవాలని, అందుకోసం విద్యార్థుల ఫీజులు పెంచాలని నూతన విద్యా విధానం- 2020 ప్రతిపాదిస్తుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలి. విద్యారంగంలో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్య విధానాలను రద్దు చేయాలి. విద్యను వ్యాపారానికి దూరంగా ప్రభుత్వ రంగంలో విస్తరించాలి.

విద్యకు నిధులు కేటాయింపు : విద్యారంగానికి జిడిపిలో ఆరు శాతం కేటాయిస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలి. వ్యక్తులు కుటుంబాలు చేసే ప్రైవేట్ ఖర్చులు ఇందులో గణించరాదు. కేంద్ర బడ్జెట్లో కనీసం 10 శాతం విద్యకు కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాశాఖ ద్వారా కనీసం 20 శాతం, సంక్షేమ శాఖ ద్వారా కనీసం 10 శాతం విద్యకు కేటాయించాలి. ప్రభుత్వం నిధులను ప్రభుత్వ సంస్థల ద్వారానే ఖర్చు చేయాలి. కేజీ నుండి పీజీ పరిశోధన స్థాయి వరకు ఉచిత విద్య అందించాలి.

విద్యాహక్కు: నూతన విద్యా విధానం-2020 రాజ్యాంగపరంగా విద్య హక్కు ను 6- 14 సంవత్సరాల వయో పరిమితి నుంచి 3- 18 సంవత్సరాల వయో పరిమితికి విస్తరించే ప్రతిపాదన చేయలేదు. విద్య హక్కు చట్టాన్ని సెకండరీ విద్యకు విస్తరించడం గురించి మాత్రమే ప్రతిపాదించింది. 18వ యేట వరకు విద్య ను బాలలు ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. ఆ మేరకు రాజ్యాంగంలో 21 అధికా రాన్ని సవరించాలి. పూర్వ ప్రాథమిక విద్య, ఎలిమెంటరీ విద్య, సెకండరీ విద్య, హయ్యర్ సెకండరీ విద్య, ఉచితంగా కామన్ స్కూల్ విధానం ద్వారా సమాన ప్రమాణాలతో అందరికీ అందించాలి. పదో తరగతి తర్వాత ఇంటర్, పాలిటెక్నిక్, ఐటిఐ, ఒకేషనల్ కోర్సుల్లో ఏదో ఒక దానిలో విద్యార్థి చదువు కొనసాగించేటట్లు చూడాలి.

ప్రీ ప్రైమరీ విద్య : నూతన విద్యా విధానం-2020లో ప్రతిపాదించినట్లు అంగన్వాడీల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించడం సాధ్యమయ్యే విషయం కాదు. అంగన్వాడీలు అందుకు స్థాపించబడలేదు. అంగన్వాడీలను పాఠశాల ఆవరణలోకి మార్చినా వచ్చే ప్రయోజనం స్వల్పమే. అంతేకాకుండా పూర్వ ప్రాథమిక వయోపరిమితిని 3- 5 సంవత్సరాలు అనికాక 4- 5 సంవత్సరాల పేర్కొనడం నూతన విద్యా విధానం-2020లో ఉన్న మరొక సమస్య. 3-5 సంవత్సరాల వయోపరిమితి బాలలకు ప్రమాణాలు గల పూర్వ ప్రాథమిక విద్య అందించడానికి పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయిని పర్యవేక్షణ కింద నడిచే శిశు సంరక్షణ, విద్యా కేంద్రాలే (ఇసిసిఇ) సరైనవి. అందుకని 3- 5 వయోపరిమితిని బాలలకు తగిన వాస్తవీకరణ చట్టం ద్వారా విద్యా, ఆహార, సంరక్షణ హక్కులు గ్యారంటీ చేయాలి.

ప్రైమరీ విద్య : తక్కువ మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని, విలీనం చేయాలని నూతన విద్యా విధానం-2020 చేసిన ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలి. వందశాతం నమోదు, వంద శాతం నిలుపుదలకు అవసరమైన విద్యార్థి మద్దతు చర్యలను ముందుగా తీసుకోవాలి. చట్టాలను ఉల్లంఘిస్తున్న ప్రైవేటు పాఠశాలలను సందర్భాన్ని బట్టి మూసివేయడం గాని, స్వాధీనం చేసుకోవడంగాని చేయాలి. ఈ రెండు చర్యలు తరువాత మాత్రమే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలల నికర నమోదుపై సరైన అంచనాలకు రావడం సాధ్యమవుతుందనే విషయం గుర్తించాలి. 1, 3, 5 కిలోమీటర్ల కనిష్ట దూర నిబంధనలను తప్పక పాటించాలి. అటువంటి హామీని నూతన విద్యా విధానం-2020 ఇవ్వలేదు. ఎస్సీ, ఎస్టీ కాలనీల పాఠశాలల విషయంలో, రహదారుల సమస్య ఉన్న సందర్భాల్లోనూ మినహాయింపులు కొనసాగించాలి. ప్రాథమిక పాఠశాలలో మెరుగైన విద్యా ప్రమాణాల కోసం 20:1 విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని అమలుచేయాలి. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలు మూసివేత, విద్యార్థి మద్దతు చర్యల ద్వారా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నమోదు పెరగడం, 20:1 ద్వారా ఉపాధ్యాయులు పెరిగితే ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు అనే పరిస్థితి ఏర్పడగలదు. అంతేగాని తరగతికి ఒక ఉపాధ్యాయుని కోసం పాఠశాలల విలీనం పరిష్కారం కాదు.

డిటెన్షన్ పాలసీ : 6వ తరగతి నుంచే డిటెన్షన్ పాలసీని అమలు చేయాలని నూతన విద్యా విధానం-2020 ప్రతిపాదిస్తుంది. ప్రాథమిక పాఠశాలలను సరిగా నిర్వహించకపోవడం వలన 6వ తరగతితో బడుగు, బలహీన వర్గాల బాలలు పెద్దఎత్తున పరీక్షలు ఫెయిల్ అవుతారు. పాఠశాలల పరిస్థితులు మెరుగుపరచటానికి బదులు అవకాశాలు కల్పించినా, సామాజిక కారణాల వలన చాలామంది అందుకోలేరని నూతన విద్యా విధానం-2020 ప్రకటిస్తూ తన మనువాద కులతత్వాన్ని బయటపెట్టుకుంది. 6వ తరగతిలో అర్హత పరీక్షలు, సమర్థత (అప్టిట్యూడ్) పరీక్షలు పెట్టి తప్పిన వారికి కౌన్సెలింగ్ ఇప్పించి మరీ సాధారణ విద్య నుండి నైపుణ్య విద్యకు పంపాలని ఈ నూతన విద్యా విధానం-2020 సూచనప్రాయంగా ప్రతిపాదిస్తుంది. ఈ ఆలోచనను, ప్రతిపాదనలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. నాన్ డిటెన్షన్ విధానాన్ని 10వ తరగతి వరకు కొనసాగించాలి. 'విద్యార్థి పరీక్ష తప్పడు, విద్యా వ్యవస్థే పరీక్ష తప్పుతుంది' అనే విషయాన్ని ముందుగా గుర్తించాలి. అన్ని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన వసతులు కల్పించి తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలి. ప్రతి బాలుడు, బాలిక విజయం సాధించేటట్లు చేసే బాధ్యత ప్రభుత్వానిది, ఉపాధ్యాయులది అని విద్యా విధానకర్తలు గుర్తించాలి.

రెండు స్థాయిల విద్య : నూతన విద్యా విధానం-2020లో ప్రతిపాదించబడిన 'పాఠశాలలో రెండు స్థాయిల విద్య' లెవెల్-ఎ, లెవెల్-బి అనే విధానాన్ని విడనాడాలి. 10వ తరగతి వరకు విద్యార్థులందరికీ ఒకే రకమైన విద్య అందించాలి. గణితం, ఆంగ్లం, విజ్ఞాన శాస్త్రం అనే అధ్యయన విషయాలలో అఖిల భారత స్థాయిలో సిలబస్ రూపొందించే ఆలోచన విడనాడాలి. పాఠశాల సిలబస్ ఆయా రాష్ట్రాల ప్రజలు, ప్రభుత్వాలు నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉండాలి. పాఠశాల పాఠ్యప్రణాళికను అఖిల భారత స్థాయిలో కేంద్రీకరించడం ఫెడరల్ సూత్రాలకు విరుద్ధమైనది.

రిజర్వేషన్లు : నూతన విద్యా విధానం-2020లో రిజర్వేషన్ల గురించి ఎటువంటి ప్రస్తావనా చేయలేదు. రిజర్వేషన్లు కొనసాగుతాయని విద్యావిధానం స్పష్టమైన ప్రకటన చేయాలి. అంతేకాక ప్రైవేటు విద్యా సంస్థలలో కూడా రిజర్వేషన్లు అమలుచేయాలి. ఇప్పుడు ఉన్న స్టైఫండ్లు, స్కాలర్షిప్పులు, ప్రభుత్వ విద్యా సంస్థలలో 'సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులకు రీయింబర్స్మెంట్ మరియు వసతి సౌకర్యం కొనసాగుతాయని నూతన విద్యా విధానం- 2020 ప్రకటించలేదు. ఈ రక్షణ, అనుకూల చర్యలు (అఫెర్మేటివ్ మెజర్స్) కొనసాగించడమే గాక విస్తరించాలి.

ఉన్నత విద్యావకాశాలు : నూతన విద్యా విధానం-2020 ఉన్నత విద్యావకాశాలు చాలా పరిమితంగా ఉన్నాయని (అందరూ 23.6 శాతం, ఎస్సీ : 18.5 శాతం, ఎస్టీ:13.3 శాతం) అంగీకరిస్తూనే కొత్తగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పెట్టేది లేదని ప్రకటిస్తుంది. 2021-22 నాటికి సంబంధిత వయో పరిమితితో నమోదు 30 శాతం చేయాలనే చాల తక్కువ స్థాయి లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. దీనిని కూడా దూరవిద్య ద్వారా సాధించాలని ప్రతిపాదించింది. ప్రభుత్వాల ఆర్థిక శక్తి పెరుగుతున్నకొద్దీ ఉన్నత విద్యావకాశాలు పెంచాలనే భారత రాజ్యాంగం 41 అధికరణం నిర్దేశాన్ని నూతన విద్యా విధానం-2020 పట్టించుకోలేదు. ప్రభుత్వం ఉన్నత విద్య విస్తరణ వ్యతిరేక ఆలోచనలు విరమించాలి. అవసరమైన కళాశాలలు, విశ్వవిద్యాలయాలు స్థాపించాలి. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒక విశ్వవిద్యాలయం స్థాపించాలి. జిల్లాలో ఉన్న ఉన్నత విద్యాసంస్థలన్నింటిని ఆ విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకురావాలి. విశ్వవిద్యాలయానికి అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలి. విశ్వవిద్యాలయాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించాలి. విశ్వవిద్యాలయాలు ప్రజలకు, విశ్వమేధావి వర్గానికి జవాబుదారిగా ఉండే విధానం తీసుకురావాలి.

అధికార కేంద్రీకరణ : నూతన విద్యా విధానం - 2020 ప్రతిపాదించిన అఖిల భారత విద్యా సర్వీసు ఆలోచనలను విరమంచాలి. నియంత్రణలో ఉండే అటువంటి అధికారుల ద్వారా రాష్ట్రాల విద్యా వ్యవస్థలను పరిపాలించాలనే ఆలోచనలను విరమించాలి. రాష్ట్రాలకు ఫెడరల్ హక్కులు, విశ్వవిద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి మౌలికమైన విషయాలు, వాటిని భగ్నం చేసే అన్ని ప్రయత్నాలు విరమించాలి.

- కెఎస్.లక్ష్మణరావు, మాజీ ఎంఎల్సీ